10



# గంజాయి రహిత జిల్లాగా మార్చాలి

■ ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలి ■ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్


ప్రభాత సమాచారం

https: epaper. prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ గురువారం | 26 మార్చి 2026 | ■ 13 పేజీలు


■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

పశ్చిమాసియా దేశాల్లో రేగుతున్న యుద్ధ జ్వాలలు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఇంధన కొరత భయాన్ని రేకెత్తించాయి! పుకార్ల వేగంతో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు భారీ క్యూలు కట్టారు. జిల్లా యంత్రాంగం, పెట్రోల్ బంకుల నిర్వాహకులు కొరత లేదని మొత్తుకుంటున్నా, ప్రజల ఆందోళన మాత్రం తగ్గడం లేదు. "నో స్టాక్" బోర్డులు కనిపిస్తుండటంతో భయాందోళనలు మరింత తీవ్రమవుతున్నాయి. ఈ పుకార్ల నేపథ్యంలో వాటర్ బాటిళ్లు, క్యాన్లతో పెట్రోల్ నిల్వ చేసుకుంటున్న ప్రజల దృశ్యాలుఅంతటా కనిపిస్తున్నాయి. అధికారులు భయాందోళనలను పారద్రోలడానికి ప్రయత్నిస్తుండగా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. మరో పక్క గ్యాస్ ధరలు పెరుగుతాయనే వదంతులతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొన్ని రోజుల నుంచి గ్యాస్ సిలిండర్ల కొరతతో వేకువ జాము నుంచే ఏజెన్సీల ఎదుట జనం బారులు దీరుతున్నారు. గ్యాస్ బుక్ చేసుకున్నా రావడం లేదని డీలర్లను నిలదీస్తున్నారు. రెండు రోజులుగా పెట్రోల్, డీజిల్ కూడా దొరకదనే వదంతులతో బం క్‌ల వద్ద టూ, త్రి, ఫోర్ వీలర్ వాహనదారులు పడిగాపులు కాస్తున్నారు. ఒకవైపు గ్యాస్, పెట్రోల్, డీజిల్ కోసం అవస్థలు పడుతుంటే.. మరోవైపు అధికారులు, పెట్రోల్, డీజిల్ డీలర్స్ అసోసియేషన్స్ వారు సరఫరాలో ఇబ్బంది, కొరత లేదని చెబుతున్నారు.



# పెట్రోల్..పరేషాన్..!

## పల్లెల నుంచి పట్టణాలకు పరుగులు

11





- ■ యుద్ధం నీడలో పెట్రోల్ కలకలం
- ■ యుద్ధం ముప్పు పుకార్లతో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఇంధన కొరత భయం!
- ■ బంకుల వద్ద వాహనదారుల క్యూ, గంటల తరబడి నిరీక్షణ
- ■ ఏజెన్సీ, బంక్‌ల ఎదుట దర్శన మిస్తున్న నో స్టాక్ బోర్డులు
- ■ కొరత మాత్రం లేదంటూ అధికారుల ప్రకటనలు
- ■ జిల్లా అధికారుల హామీలు ఉన్నా.. తగ్గని ప్రజల ఆందోళన
- ■ వాటర్ బాటిళ్లు, క్యాన్లతో ఇంధనం నిల్వ చేసుకుంటున్న ప్రజలు
- ■ సిలిండర్ల కోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు
- ■ ఉమ్మడి జిల్లాలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయి..
- ■ పుకార్లను నమ్మవద్దు.. తప్పుడు ప్రచారం చేయొద్దు
- ■ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు



కవ్వాల టైగర్ రిజర్వ్‌లో

# శాఖాపరమైన వేటు

### ఇద్దరు అటవీ అధికారుల సస్పెన్షన్

## ఆర్జీయూకేటీలో డీఎస్పీగా సాయికిరణ్



ఇటీవల బాసర ఆర్జీయూకేటీలో చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో డీజీపీ ఆదేశాల మేరకు ఆర్జీయూకేటీ ఇంచార్జీ డీఎస్పీగా నిర్మల్ ఏఎస్పీ సాయికిరణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

# కాగితాలకే పరిమితమైన 'డిజిటల్'కల

ప్రభాత సమాచారం, ఉట్నూర్

గ్రామ పంచాయతీ పాలనలో పారదర్శకత పెంచేందుకు, ఇంటింటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'టీ-ఫైబర్' పథకం జిల్లాలో అభాసుపాలవుతోంది. లక్షల రూపాయల నిధులతో గ్రామాల్లో సోలార్ ప్లేట్లు, బ్యాటరీ వ్యవస్థలను ఏర్పాటు చేసినా, నేటికీ కేబుల్ అనుసంధానం జరగకపోవడంతో సాంకేతిక సేవలు అందని ద్రాక్షలా మారాయి. డిజిటల్ విప్లవం వస్తుందని ఆశించిన ప్రజలకు, అధికారుల నిర్లక్ష్యం నిరాశనే మిగులుస్తోంది. పంచాయతీలకు డిజిటల్ సేవలు అందించాలని లక్ష్యంతో 2017లో తెలంగాణ ఫైబర్ గ్రేడ్, గత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పెరుగుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా ఇంటింటికి ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యం పెట్టుకున్నారు.

- ■ తుప్పు పడుతున్న టీ-ఫైబర్ పరికరాలు!
- ■ లక్షల నిధులు వెచ్చించినా లభించని 'లింక్'
- ■ పంచాయతీల్లో అందని అంతర్జాల సేవలు!
- ■ గ్రామాల్లో అటకెక్కిన 'టీ-ఫైబర్'
- ■ అలంకారప్రాయంగా సోలార్ ప్లేట్లు, బ్యాటరీలు!
- ■ పంచాయతీలకు అందని 'సాంకేతిక' ఫలాలు..
- ■ ఏళ్లు గడిచినా అసంపూర్తిగానే డిజిటల్ సేవలు!



3

# ఆదిలాబాద్‌లో 'మహిళా మార్ట్'

05

- ■ మహిళా సాధికారతకు సరికొత్త చిరునామా
- ■ 'మేడ్ ఇన్ ఆదిలాబాద్ - ఫర్ ఆదిలాబాద్'
- ■ స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్..
- ■ ఆదివాసీల ప్రకృతి సిద్ధ ఉత్పత్తుల విక్రయ కేంద్రం
- ■ మహిళా మార్ట్‌ను ప్రారంభించిన కలెక్టర్ రాజర్షి షా



జిల్లాలోని మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో అదిలాబాద్ జిల్లా యంత్రాంగం కీలక ముందడుగు వేసింది. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన 'అదిలాబాద్ మహిళా మార్ట్'ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, మున్సిపల్ చైర్ పర్సన్ అనూషతో కలిసి ప్రారంభించారు. 'మేడ్ ఇన్ అదిలాబాద్ - ఫర్ అదిలాబాద్' అనే నినాదంతో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ వేదికగా మార్ట్ నిలవనుంది.



# విద్యారంగ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం





- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- కేజీబీవీలో కలెక్టర్ తనిఖీ
- అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశం
- సర్కారీ బడుల్లో సకల సౌకర్యాలు
- నాణ్యమైన బోధనే ధ్యేయం!
- కాసిపేట మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన
- విద్య, వైద్యం, పారిశుధ్యంపై సమీక్ష

**కాసిపేట, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని కాసిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాటాడుతూ ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేస్తూ అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సౌకర్యాలను కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్య బోధన అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులు, అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. 8వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకుని విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. మండల కేంద్రంలో పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ, నివాస ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, రహదారులు, మురుగు కాలువలలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి శుభ్రంగా ఉంచాలని తెలిపారు. లబ్ధిదారులు తమకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని, ఆ దిశగా అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం లంబడితండ (కె) గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలోని పల్లె దవాఖానను సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, పారిశుధ్య నిర్వహణ, రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. పెద్దనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి గ్రామంలో ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అకాల వర్షం దెబ్బకు రైతన్నకు భారీ నష్టం



**బజార్‌హత్నూర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

మండలంలోని బజార్‌హత్నూర్, కొలహరి బాలన్‌పూర్ గ్రామాల్లో నిన్న కురిసిన అకాల వర్షం రైతులకు భారీ నష్టాన్ని మిగిల్చింది. మండలంలోని పంటపొలాల్లో మొక్కజొన్న, గోధుమ, జొన్న పంటలు విస్తారంగా నేల కూలిపోయాయి. బజార్‌హత్నూర్ గ్రామానికి చెందిన రైతు బొమ్మెత చందర్ తన 3 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేయగా, అందులో 2 ఎకరాల పంట పూర్తిగా నేల కూలిపోయింది. చేతికి వచ్చిన పంట కళ్లముందే నేలమట్టం కావడంతో రైతు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. ఒకవైపు ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాల కారణంగా పంటలు సరిగా పండక పెట్టుబడులు కూడా రాలేదు. రబీ సీజన్‌లో అయినా పంటలు పండించి అప్పులు తీర్చుకోవాలని ఆశించిన రైతులకు ఈ అకాల వర్షం మరో పెద్ద దెబ్బగా మారింది. దీంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోయారు. నష్టపోయిన పంటలను ప్రభుత్వం పరిశీలించి, రైతులకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## జిల్లాలో పెట్రోల్ కొరత లేదు

### కొమురం భీం జిల్లా ఎస్పీ నితికా పంత్

**ఆసిఫాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని జిల్లా ఎస్పీ నితికా పంత్ అన్నారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సోసల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వదంతుల కారణంగా ప్రజలు ఆందోళనకు గురవుతూ వాహనాల్లో ఫుల్ ట్యాంక్ నింపుకునేందుకు ఒకే సారి పెట్రోల్ బంక్‌లకు వెళ్లడం వల్ల అంతరాయం ఏర్పడతుందని చెప్పారు. జిల్లాలో అన్ని పెట్రోల్ బంక్‌లకు సరిపడ ఇంధన నిలువలు ఉన్నాయని, సరఫరా కూడా నిరంతరంగా కొనసాగుతున్నదని తెలిపారు. ఎటువంటి కొరత పరిస్థితి లేదని, ప్రజలు అవసరానికి మించి ఇంధనం నిలువ చేసుకోవడానికి ప్రయత్నించవద్దని సూచించారు. అలాగే చేయడం వల్ల ఇతరులకు అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. అసత్య వదంతులు వ్యాప్తి చేసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అన్నపై తమ్ముడి దాడి

**చెన్నూర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

కొమ్మెర గ్రామంలో భూ తగాదాల నేపథ్యంలో అన్నపై తమ్ముడు గొడ్డలితో దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. ఇవ్వాళ కొమ్మెర గ్రామంలో ఆస్తి వివాదం కారణంగా జోగురు రాజయ్య (48)పై అతడి తమ్ముడు, కుటుంబ సభ్యులు దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో రాజయ్య తీవ్రంగా గాయపడగా స్థానికులు చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న తహశీల్దార్ మల్లికార్జున్ ఆసుపత్రికి చేరు కుని రాజయ్య వాంగ్మూలం నమోదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్జీయూకేటీలో డీఎస్పీగా సాయికిరణ్

**ముథోల్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**



డీజీపీ ఆదేశాల మేరకు బాసర ఆర్జీయూకేటీలో ఇంచార్జ్ డీఎస్పీగా నిర్మల్ ఏఎస్పీ పి.సాయికిరణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. యూనివర్సిటీ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, విద్యార్థులు, సిబ్బందికి భద్రత కల్పించడం తోపాటు యూనివర్సిటీ పరిపాలనతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వర్తిస్తానని ఆయన పేర్కొన్నారు.

## గిరిజన నాయకుల ముందస్తు అరెస్ట్

**జైనూర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

ఛలో అసెంబ్లీ ముట్టడికి బయలు దేరిన గిరిజన సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా ఎక్కడి వారిని అక్కడే అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. బుధవారం గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వ హించిన అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా లంబాడా నాయకులు పవార్ పితా నాయక్‌ను జైనూర్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం గిరిజనులకు అన్యాయం చేస్తోందని, న్యాయం చే యకపోతే ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామన్నారు.


## బహిరంగంగా పెట్రోల్ విక్రయిస్తే కఠిన చర్యలు

- పుకార్లు నమ్మవద్దు.. ఒకరిపై కేసు నమోదు
- 30 లీటర్ల నిల్వలు స్వాధీనం..
- బంక్ యజమానిపైనా చర్యలు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడి



**ఆదిలాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

నిబంధనలకు విరుద్ధంగా బహిరంగంగా పెట్రోల్ విక్రయిస్తున్న వ్యక్తిపై ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ దాడుల్లో భారీగా పెట్రోల్ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తులో, అధిక ధరలకు డబ్బాల్లో పెట్రోల్ విక్రయిస్తూ ప్రజలను మోసం చేయడమే కాకుండా, భద్రతా నిబంధనలు పాటించకుండా అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ చర్యలు ప్రజల ప్రాణాలకు మరియు ఆస్తులకు తీవ్రమైన ముప్పుగా మారే అవకాశమున్నందున, సంబంధిత వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, నిబంధనలను అతిక్రమించి ఇలాంటి వ్యక్తులకు పెట్రోల్ సరఫరా చేసిన బంక్ యజమానిపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రజలు "పెట్రోల్ కొరత" పేరుతో వ్యాప్తి చెందుతున్న పుకార్లను నమ్మవద్దని ఎస్పీ సూచించారు. అవసరానికి మించి పెట్రోల్ నిల్వ చేసుకోవడం ప్రమాదకరమని, ఇలాంటి చర్యలు అగ్ని ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని తెలిపారు. పెట్రోల్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేదని, అందుబాటులో తగినంత నిల్వలు ఉన్నాయని స్పష్టం చేశారు. సందేహాస్పదంగా ఎక్కడైనా బహిరంగంగా పెట్రోల్ విక్రయం జరుగుతున్నట్లు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు "పెట్రోల్ లేదంటూ" దుష్ప్రచారం చేసేవారి మాటలకు నమ్మవద్దని, అలా చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ వన్ టౌన్ సిఐ బి. సునీల్ కుమార్ పాల్గొన్నారు.



# కాగితాలకే పరిమితమైన 'డిజిటల్'కల

- తుప్పు పడుతున్న టీ-ఫైబర్ పరికరాలు!
- లక్షల నిధులు వెచ్చించినా లభించని 'లింక్'
- పంచాయతీల్లో అందని అంతర్జాల సేవలు!
- గ్రామాల్లో అటకెక్కిన 'టీ-ఫైబర్'
- అలంకారప్రాయంగా సోలార్ ప్లేట్లు, బ్యాటరీలు!
- పంచాయతీలకు అందని 'సాంకేతిక' ఫలాలు..
- ఏళ్లు గడిచినా అసంపూర్తిగానే డిజిటల్ సేవలు!

"గ్రామ పంచాయతీల పాలనలో పారదర్శకత పెంచేందుకు, ఇంటింటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'టీ-ఫైబర్' పథకం జిల్లాలో అభాసుపాలవుతోంది. లక్షల రూపాయల నిధులతో గ్రామాల్లో సోలార్ ప్లేట్లు, బ్యాటరీ వ్యవస్థలను ఏర్పాటు చేసినా, నేటికీ కేబుల్ అనుసంధానం జరగకపోవడంతో సాంకేతిక సేవలు అందని ద్రాక్షలా మారాయి. డిజిటల్ విప్లవం వస్తుందని ఆశించిన ప్రజలకు, అధికారుల నిర్లక్ష్యం నిరాశనే మిగులుస్తోంది."

**ఉట్నూర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

గ్రామ పంచాయతీలకు డిజిటల్ సేవలు అందించాలని లక్ష్యంతో 2017లో తెలంగాణ ఫైబర్ గ్రేడ్, (టి.ఫైబర్ పథకాన్ని) గత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పెరుగుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా ఇంటింటికి ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యం పెట్టుకున్నారు. మిషన్ భగీరథ పైప్లైన్‌తో పాటు ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు కేబుల్ ను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ భవనాలకు సోలార్ ప్లేట్లు, బ్యాటరీలు, ఇతర సామాగ్రిని ఏర్పాటు చేశారు. లక్షల రూపాయలు వెచ్చించి పథకాన్ని ప్రారంభించిన, నేటి వరకు ఆచరణలోకి రాలేదని పలువురు వాపోతున్నారు. గ్రామాల్లో అమలవుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, నిధుల ఖర్చు, పంచాయతీ సిబ్బంది జీవితపత్యాలు, ఆదా య, వయ్యాళ్లు, పలు రకాల ధ్రువీకరణ పత్రా ల జారీ వంటి డిజిటల్ రూపంలో తీసుకురావాలన్నదే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. పంచా యతీలో డిజిటల్ సేవల విధానాన్ని ఐటీ శాఖకు అనుసంధానిస్తే కలిగే అవకాశాలు ఉన్నాయి. కానీ ఇప్పటి వరకు ఇంటర్నెట్ కేబుల్ లో అనుసంధానమే జరగలేదు. జిల్లాలోని 473 గ్రామ పంచాయతీ భవనాల్లో టీ ఫైబర్ సేవల కోసం సోలార్ ప్లేట్ల ఏర్పాటు ద్వారా విద్యుత్ వసతి కల్పించాలని నిర్ణయించారు. గ్రామ పంచాయతీలలో సోలార్ ప్లేట్లు, గదిలో బ్యాటరీలు ఇతరాత్ర పరికరాలు ను ఏర్పాటు చేశారు. గతంలో కొన్ని గ్రామ పంచాయతీలకు కంప్యూటర్లను అందించి కొన్నాళ్లు ఆపరేటర్లు సైతం నియమించుకున్నారు. ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో ఇవి వృధాగా మారాయి.. ఇంటర్నెట్ అనేది విలాసం కాదు, అవసరం. విద్యార్థులకు ఆన్‌లైన్ విద్య, రైతులకు మార్కెట్ సమాచారం, ప్రజలకు ప్రభుత్వ సేవలు అందాలంటే టీ-ఫైబర్ పని చేయాల్సిందే. రూ.లక్షల సామాగ్రిని గదుల్లో పెట్టి తాళాలు వేయడం వల్ల ఎవరికి లాభమని జనం ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని గ్రామాల్లో సాంకేతిక సేవలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## న్యాయవాదుల రక్షణ చట్టాన్ని కేబినెట్ ఆమోదించడంపై హర్షం

**ఉట్నూర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

న్యాయ వృత్తిలో నిరంతరం న్యాయం కోసం పాటుపడే న్యాయవాదుల రక్షణ కోసం తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు కేబినెట్ ఆమోదించడం హర్షనీయమని మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ ఉత్తర తెలంగాణ అధ్యక్షులు కుడెల్లి అశోక్ అన్నారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడుల ఘటనలను కట్టడి చేసేందుకు, న్యాయవాదులకు రక్షణ కల్పించేందుకు ఈ బిల్లు రూపొందించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అశోక్ పేర్కొన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే అమలు జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఇంధన కొరతకు తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలి

### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం సంబంధిత శాఖల అధికారులు, పెట్రోల్ బంక్ డీలర్లతో నిర్వహించిన జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇంధన కొరత తలెత్తకుండా నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ, సరఫరా నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వినియోగదారులు అనవసరంగా ఇంధనాన్ని నిల్వ చేసుకునే పరిస్థితి రాకుండా అవగాహన కల్పించడంతో పాటు, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. చమురు సంస్థల ప్రతినిధులతో సమన్వయం కొనసాగిస్తూ జిల్లాకు అవసరమైన ఇంధన కోటాను సకాలంలో తెప్పించుకోవాలని డీలర్లకు సూచించారు. జిల్లాలో ఎక్కడా 'స్టాక్ లేదు' అనే బోర్డులు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని, అత్యవసర సేవల వాహనాలకు ఇంధన సరఫరాలో ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్ కొరతపై వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, ఎలాంటి సమస్యలు లేదా సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1800 425 1939ను సంప్రదించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ జూమ్ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి నందిని, తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, చమురు సంస్థల ప్రతినిధులు, పెట్రోల్ బంక్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన పొన్కల్ సర్పంచ్

**జన్నారం, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలోని పొనకల్ మేజర్ గ్రామపంచాయతీకి సానిటైజేషన్ కోసం రెండు ఆటోలు కావాలని. పొనకల్ గ్రామపంచాయతీ సర్పంచ్ జగ్గు సుష్మ భూమేష్ పంచాయతీ కార్యదర్శి రాహుల్ కలెక్టర్ కుమార్ దీపక్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు.





### గంజాయి నిర్మూలనకు

## ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

### ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుధవారం ఉదయం ఆదిలాబాద్ టు టౌన్ పెట్టన పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ, సిబ్బందికి పలు సూచనలు చేయడం జరిగింది. జిల్లాలో, పట్టణంలో గంజాయి లేకుండా ప్రతి ఒక్క సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా ప్రతి వార్డు నందు ప్రజలు స్వచ్ఛందంగా సిసిటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేయాలన్నారు. నేరాలు జరగకుండా మరియు జరిగిన నేరాలను త్వరితగతిన ఛేదించడానికి సీసీటీవీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. ఆర్థిక నేరాలు దొంగతనాలు జరగకుండా పటిష్టమైన గస్తీ నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా టూ టౌన్ పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి కేసును నందు శిక్షలు పడే విధంగా దర్యాప్తు కొనసాగించాలని తెలిపారు. తప్పు చేసిన ప్రతి ఒక్క నేరస్తునికి శిక్ష కచ్చితంగా పడేవిధంగా పరిశోధన జరగాలని సూచించారు. పట్టణంలో రోడ్డు ప్రమాదాలపై, ప్రజలకు హెల్మెట్ యొక్క ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు, ఎస్సైలు పీర్ సింగ్,అఖిల్, విష్ణు ప్రకాష్, డి సి ఆర్ బి ఎస్ ఐ దివ్యభారతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విదేశీ విద్య అధ్యయనానికి ఫిన్లాండ్ వెళుతున్న కిష్టాపూర్ ఉపాధ్యాయుడు కమలాకర్

**జన్నారం, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలోని కిస్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు దాముక కమలాకర్ విదేశీ విద్య అధ్యయనం కోసం ఫిట్లాండ్ దేశం వెళుతున్న సందర్భంగా ఆయనను అభినందించిన పాఠశాల ఉపాధ్యాయ బృందం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఉపాధ్యాయులను ఇంటర్నేషనల్ ఎక్స్పోజర్ విజిట్స్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం ఫర్ టీచర్స్ పేరిట విదేశీ విద్యా ప్రమాణాల అధ్యయనం చేయుటకు, అత్యుత్తమ విద్య బోధనను అధ్యయనం కోసం రాష్ట్రంలోని 28 మంది ఉపాధ్యాయులను ఫిన్లాండ్ దేశం వెళ్లడానికి ఎంపిక చేసింది అందులో కిస్టాపూర్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ శ్రీ దాముక కమలాకర్ ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న అలాగే ఉపాధ్యాయ బృందం వారిని పాఠశాలలో మంగళవారం అభినందించారు. వచ్చే ఏప్రిల్ 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు ఫిన్లాండ్ దేశంలో పర్యటించి అక్కడ అత్యుత్తమ విద్య బోధనలు పరిశీలించి విద్యా బోధన మెళుకువలు తెలుసుకొని వాటిలో అత్యుత్తమైనటువంటి బోధన పద్ధతులను మన రాష్ట్రంలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చూడాలి. వీరితో పాటు విద్యాశాఖలోని ఉన్నత అధికారులు వారి వెంట ఫిన్లాండ్ దేశం వెళ్లనున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్య మండల విద్యాశాఖ అధికారి విజయ్ కుమార్ గ్రామ సర్పంచ్ వాసాల నరేష్ అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్పర్సన్ శ్రీమతి మంగ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాడి



మురళి, గోవర్ధన చారి, కొట్టే రాజన్న, బుచ్చి లింగయ్య బి ప్రకాష్,నగేష్, మణెమ్మ,జ్యోతిశీల, అశోక్, నరహరి శర్మ, వాసు, కాంతయ్య, శ్రీనివాస్, రజిత రాణి, సుస్మిత, అజీమ్. స్వప్న, శేఖర్, అశోక్,చంద్రకళ లు పాల్గొన్నారు.

# దంతన్‌పల్లిలో స్పెషలిస్ట్ మెడికల్ క్యాంప్







- సందర్శించిన కలెక్టర్ రాజర్షి షా
- ప్రజల ముంగిటకే కార్పొరేట్ వైద్యం
- సర్కారు లక్ష్యం మెరుగైన ఆరోగ్యం!
- ఆర్ఎంపిల వద్దకు వెళ్ళకండి.. ప్రాణాలతో చెలగాటం వద్దు
- ఆదిలాబాద్ కలెక్టర్ సుడిగాలి పర్యటన
- వైద్య శిబిరం, ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన

**ఆదిలాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్పెషలిస్ట్ మెడికల్ క్యాంపును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిమ్స్ నుండి వచ్చిన ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆప్తాల్మాలజీ వంటి ఆరు రకాల స్పెషలిస్ట్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో కిడ్నీ సంబంధిత వ్యాధులు, రక్తహీనత సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయని, వీటి నివారణకు ప్రజలు పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలని సూచించారు. ఆర్.ఎం.పిల వద్దకు వెళ్లి అనవసరంగా యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ వాడడం వల్ల కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందని, కేవలం ప్రభుత్వ ఆసుపత్రుల్లోని అర్హులైన వైద్యుల సలహా మేరకే మందులు వాడాలని వివరించారు. రక్తహీనత సమస్య ఉన్నవారు ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ టాబ్లెట్లను క్రమం తప్పకుండా వాడాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంతకుముందు ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించే పలు సూచనలు చేశారు. అనంతరం దంతన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నిర్మాణాల పురోగతిని పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడుతూ, పనుల్లో వేగం పెంచి వర్షాకాలానికి ముందే నిర్మాణాలు పూర్తి చేసేల ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇసుక కొరత, బిల్లుల చెల్లింపులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారులు సాధన, మనోహర్, టిబి ప్రోగ్రామ్ అధికారి సుమలత, తహసిల్దార్ రఘునాథ్, ఎంపీడీవో రామ్ ప్రసాద్, సర్పంచ్ అంకవ్వ, ఉప సర్పంచ్ మోబిన్, వైద్య సిబ్బంది, ఏఈ లు దివ్య, వంశీ పాల్గొన్నారు.

# 'ప్రగతి ప్రణాళిక'పై ప్రత్యేక దృష్టి సారించాలి

**జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు**



**దండేపల్లి, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'పై ప్రత్యేక దృష్టి సారించి గ్రా మాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. బుధవారం దండేపల్లితో పాటు రెబ్బనపల్లి గ్రామాలను ఆయన సందర్శించి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రతిఒక్కరూ భాద్యత తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత ఎంత ముఖ్యమో పరి సరాల పరిశుభ్రత అంతే ముఖ్యమన్నారు. గ్రామాల్లోని ఎక్కడ కూడా ప్లాస్టిక్ కనిపించకుడా చూడాలన్నారు. సెగ్రిగేషన షెడ్‌లలో సేంద్రియ ఎరువుల ఉత్పత్తి జరిగేలా పంచాయతీ కార్యదర్శులు చూడాలని ఆదేశిం చారు. గ్రామాల్లోని సైడ్ డ్రైనేజీలో మురికినీరు, చెత్తచెదారం లేకుండా సిబ్బందితో శుభ్రం చేయించాలన్నారు. వేసవికాలంలో గ్రామాల్లోని తాగు నీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం దండేపల్లిలో సర్పంచ, ఉపసర్పంచ, వార్డు సభ్యు లతో సమావేశం నిర్వహించి గ్రామాల్లో చేపట్టే పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచులు రాజేశ్వర్‌నాయక్, కల్యాణి అశోక్, ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఎంపీవో విజయ ప్రసాద్, ఉపసర్పంచ నవీన, పంచాయతీ కార్యదర్శులు శ్రీలతరెడ్డి, గంగారం, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పం చ బచ్చలి రాములు పేర్కొన్నారు. బుధవారం దుబ్బపల్లి గ్రామంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రోడ్ల పక్కన ఉన్నచెట్ల కొమ్మలను తొలగించి శుభ్రం చేయించారు.



# ఎల్లారం రోడ్డు.. నరకానికి దారి!

**ఆరేళ్లుగా అసంపూర్తిగా పనులు**
**కంకర తేలి అధ్వాన్నంగా మారిన రహదారి**
**పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు**
**రూ.40 లక్షలు మంజూరైనా పట్టించుకోని కాంట్రాక్టర్**

**ఆసిఫాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రం నుంచి ఎల్లారం గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రోడ్డు పూర్తిగా కంకర తేలి అధ్వాన్నంగా మారింది. రోడ్డు మరమ్మతు పనులు ఆలస్యం కారణంగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. సదరు కాంట్రాక్టర్ పనులను సకాలంలో పూర్తి చేయకుండా వదిలేయడంతో గ్రామస్థులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపడం లేదు. 2018లో రోడ్డు నిర్మాణం, మరమ్మతులకు గాను 40 లక్షల నిధులు మంజూరు కాగా సంబంధిత కాంట్రాక్టర్ కొంత దూరం కంకర పోసి పనులను పూర్తి చేయకుండా వదిలి వేశారు. ఎల్లారం, కంచర్‌గూడ గ్రామాల ప్రజలు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. కంకర తేలి ఉన్న ఈ రోడ్డు పై వెళ్లాలంటే నిత్యం నరక యాతన పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులైతే ఎదో ఒకచోట పడి గాయాలపాలవుతున్నా రని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ రోడ్డు దెబ్బతినడంతో గ్రామానికి వెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. ప్రతి రోజు జిల్లా కేంద్రానికి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ రోడ్డు వెంట అతి కష్టంగా రాకపోకలు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఇక నైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరు తున్నారు. అధికారులు పట్టించుకోకుంటే కలెక్టరేట్ ఎదుట ఆందోళన కార్యక్రమం చేపడుతామని గ్రామస్తులు చెబుతున్నారు.

# చిల్డ్రన్ పార్క్ అభివృద్ధికి కృషి

**ఆసిఫాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని కొట్నాక భీమ్ రావు చిల్డ్రన్స్ పార్క్ అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్ తెలిపారు. మంగళవారం ఆయన పార్కును సందర్శించి అక్కడి సదుపాయాలను పరిశీలించారు. పార్కులో ఏర్పాటు చేసిన స్ప్రింక్లర్ వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో పార్కుకు సందర్శకుల రద్దీ పెరిగే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా పార్కులో అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిల్లలు, కుటుంబ సభ్యులు సంతోషంగా సమయం గడపడానికి పార్కును మరింత అందంగా తీర్చిదిద్దడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి మున్సిపాలిటీ కృషి చేస్తుందని పేర్కొన్నారు.

# ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో బీఎస్పీ ఇన్‌చార్జ్‌ల నియామకం

**ఆసిఫాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**



బహుజన్ సమాజ్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో పార్టీ వ్యవస్థను బలోపేతం చేయడానికి వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఆదిలాబాద్ జోన్-1 చీఫ్ జోన్ ఇన్‌చార్జ్ అడ్వకేట్ నిశాని రామచంద్రం ప్రకటించారు. నియామకాల ప్రకారం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆసిఫాబాద్ కు చెందిన సాలం బిన్ హసన్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. బోథ్, బైంసా నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌గా కనక ప్రభాకర్‌ను నియమించారు. ఖానాపూర్, నిర్మల్ నియోజకవర్గాలకు తుడిచిర్ల సంజయ్‌ను బాధ్యతలు అప్పగించారు. ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి పాముల హరినాథ్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. పార్టీ బలోపేతం, గ్రామ స్థాయిలో కార్యకర్తలను సమీకరించడం, ప్రజా సమస్యలపై పోరాటాలు చేపట్టడం వంటి బాధ్యతలను వీరు నిర్వర్తించనున్నట్లు పార్టీ నాయకత్వం తెలిపింది. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని నాయకత్వం వారికి సూచించింది. నియమితులైన నాయకులు పార్టీ ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి బీఎస్పీని బలపరచడానికి కృషి చేస్తామన్నారు.

# అటవీశాఖ ఆధ్వర్యంలో సోలార్ దీపాలు ఏర్పాటు

**బెజ్జూర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

మండలంలోని ఇందర్గాం, రేచిని, గబ్బాయి, తలాయి గ్రామాలలో సోలార్ దీపాలను ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు. మారుమూల గ్రామాల అభివృద్ధిపై అటవీ శాఖ కూడా కృషి చేస్తుందని తెలిపారు. అడవుల సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. అడవిలో నిప్పు పెట్టడం తో వన్యప్రాణులకు, జీవవైవిధ్యానికి ముప్పు పొంచి ఉందన్నారు. అడవిలో ఎవరైనా నిప్పు పెడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని సూచించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో మారుమూల గ్రామాలలో సోలార్ దీపాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కృష్ణ పల్లి సర్పంచ్ వడ్డేపల్లి లావణ్య శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, సెక్షన్ అధికారి సఫియా బేగం, బీట్ అధికారులు స్రవంతి, వెంకటేశం పాల్గొన్నారు.





# ఆదిలాబాద్‌లో 'మహిళా మార్ట్' ప్రారంభం





**మహిళా సాధికారతకు సరికొత్త చిరునామా**
**కలెక్టరేట్ ఎదుట మహిళా మార్ట్!**
**'మేడ్ ఇన్ ఆదిలాబాద్ - ఫర్ ఆదిలాబాద్'**
**స్వయం సహాయక సంఘాల**
**ఉత్పత్తులకు మార్కెటింగ్ భరోసా**
**ఆదివాసీల ప్రకృతి సిద్ధ ఉత్పత్తుల విక్రయ కేంద్రం**
**మహిళా మార్ట్‌ను ప్రారంభించిన కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
మహిళా సాధికారత దిశగా అదిలాబాద్ జిల్లా మరో ముందడుగు వేసిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం జిల్లా మహిళా సమాఖ్య, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన అదిలాబాద్ మహిళా మార్ట్' ప్రారంభోత్సవానికి మునిసిపల్ చైర్ పర్సన్ బండారి అనూషతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని మహిళా సంఘాలు తయారు చేస్తున్న సుమారు 30 రకాలకు పైగా నాణ్యమైన ఉత్పత్తులు ఈ మార్ట్‌లో లభ్యమవుతాయని తెలిపారు. పట్టణ నడిబొడ్డున, ప్రధాన రహదారి పక్కనే ఈ మార్ట్‌ను ఏర్పాటు చేయడం వల్ల వినియోగదారులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన వస్తువులు నేరుగా అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆదివాసీలు తయారు చేసే ప్రకృతి సిద్ధమైన ఉత్పత్తులకు, అటవీ ఉత్పత్తులకు ఇక్కడ ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. 'మేడ్ ఇన్ అదిలాబాద్ – ఫర్ అదిలాబాద్' అనే నినాదంతో ప్రారంభమైన ఈ మార్ట్, భవిష్యత్తులో హైదరాబాద్‌లోని ఐఎంఎస్ బజార్ తరహాలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, జిల్లాలో మహిళా సంఘాల ద్వారా తయారైన ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ వినూత్న విక్రయ కేంద్రాన్ని అందుబాటులోకి తెలిపారు. కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా మహిళలు వ్యాపార రంగంలోనూ రాణించడం గర్వకారణమని కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్, వార్డ్ కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, మహిళా సమైఖ్య సభ్యులు లక్ష్మి, బృందన, మంజుల, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## వాలిడేషన్ బిల్లు రద్దు చేయాలి

**బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ వినతి**

**బెల్లంపల్లి, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన ప్రవేశ పెట్టిన వాలిడేషన్ బిల్లును రద్దు చేయాలని తెలంగాణ విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన నిరసనలో భాగంగా బుధవారం బెల్లంపల్లిలో విశ్రాంతి ఉద్యోగులు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన ప్రవేశపెట్టిన వాలిడేషన్ బిల్ ను రద్దు చేయాలని బెల్లంపల్లి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు బోడ రాజయ్య, సిహెచ్ శంకర్ నాయకత్వంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కు వినతి పత్రం అందచేశారు. అంతరం వారు మాట్లాడారు. విశ్రాంతి ఉద్యోగులకు తీరని నష్టం చేస్తున్నా వాలిడేషన్ బిల్లును వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జోక్యం చేసుకుని బిల్లు ను నిలిపి వేయాలని కోరారు. ఈ బిల్లు వల్ల విశ్రాంతి ఉద్యోగులు జీవితాలు కకావికలం అవుతాయని ఆందోళనా వ్యక్తం చేశారు. ఈ బిల్లువిశ్రాంతి ఉద్యోగులు లకు పూర్తి వ్యతిరకమని విమర్శించారు. బిల్లు రద్దు చేయకపోతే తామిచేపట్ట బోయే ఆందోళలనకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు. తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం బెల్లంపల్లి శాఖ నాయకులు పాల్గొన్నారు.

## నిర్మల్ నుంచి ముథోల్‌కు బస్సు సర్వీస్

**నిర్మల్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
ఆర్టీసీ నిర్మల్ నుండి లోకేశ్వరం, పంచగూడ, అబ్దుల్లాపూర్ మీదుగా ముదోల్ పల్లెవెలుగు బస్సు ప్రారంభించినట్లు నిర్మల్ డిపోమేనేజర్ కే.పండరి తెలిపారు. ఈ బస్సు ఉదయం నిర్మల్ నుండి 10.45 నిలకు బయలుదేరి 11.30 నిలకు లోకేశ్వరం నుండి బయలుదేరి పంచగుడి అబ్దుల్లాపూర్ మీదుగా 12.30నిలకు చేరుకొని తిరిగి 12.50 ని!! లకు ముదోల్ నుండి బయలుదేరి అబ్దుల్లపుర్ లోకేశ్వరం ద్వారా 14.30 కి నిర్మల్ చేరుకుంటుంది. ఈ సదావకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగ పరచుకోవాలని ఆయన కోరారు.

# 108 మొబైల్ ఫోన్లు రికవరీ.. బాధితులకు అందజేత



**ఆసిఫాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో ప్రజలు పోగొట్టుకున్న రూ.10 లక్షల విలువ చేసే 108 ఫోన్లను రకవరీ చేసి బాధితులకు అప్పగించామని ఎస్పీ నితికా పంత్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం సెల్‌పోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి జిల్లాలో గత కొన్ని రోజులుగా సీఈఐఆర్ ద్వారా పట్టుకున్న రూ.10 లక్షల విలువ చేసే 108 ఫోన్లను బాధితులకు ఎస్పీ ఫోన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫోన్‌పోయినా, చోరీకి గురైనా సీఈఐఆర్ వెబ్ ఫోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఇలా ఫిర్యాదు చేసిన ఫోన్లను మన రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాల్లో ఫోన్లు రికవరీ అయ్యాయని చెప్పారు. ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ లేనిది ఒక చిన్న లావాదేవీ కూడా చేయలేని మన విలువైన సమాచారం, బ్యాంకు అకౌంట్స్, పాస్‌వర్డ్ వంటి మొబైల్‌లో సేవ్ చేసి పెట్టుకుంటామని తెలిపారు. నేరగాళ్లు మొబైల్ ఫోన్ దొంగలించి వీక్ పాస్ వర్డ్‌లను బ్రేక్ చేసి ఫోన్‌పే, గూగుల్‌పే తదితర మాధ్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్నా లేదా దొంగలించబడిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో బ్యాక్ చేసి సంబంధిత పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా సెకండ్‌హ్యాండ్ ఫోన్ కొనుగోలు చేసినట్లయితే అట్టి షాపు యజమాని నుంచి రశీదు తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీకోర్ ఇన్స్‌పెక్టర్ రవీందర్, డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్, సీఐలు బాలాజీ వరప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కిడ్స్ పాఠశాలలో ఫుడ్ పేస్ట్ కార్యక్రమం



**నిర్మల్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ పట్టణంలోని కిడ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమం వినూత్న సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఫుడ్ ఫెస్ట్ విద్యార్థులు కొనుగోలు చేసిన టికెట్ల ద్వారా మొత్తం రూ.15,000/- సేకరించబడింది. ఈ నిధిని ఒక మంచి కార్యానికి వినియోగించాలనే సంకల్పంతో, పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్యామ్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని గణిత ఉపాధ్యాయుడు శ్యామ్‌కి అందజేశారు. ఈ నగదు మొత్తాన్ని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు కలిసి శ్యామ్ కి అందించడం గొప్ప విశేషం. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నవీన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పురుషోత్తం, వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రైతులను ప్రజలను మోసం చేసిన సర్కార్

**బిఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త డా. కిరణ్ కొమ్రెవర్**

**కుభీర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో అధికారులు ఉన్న ప్రజా పాలన ప్రభుత్వం రైతులను ప్రజలను మోసం చేసిందని ఆయన బిఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త డా. కిరణ్ కొమ్రెవర్ దజమెత్తారుమెత్తారు. బుధవారం కుభీర్ మండలంలోని చాత, పార్డి-దీ రైతుల పోరుబాట నిర్వహించారు. రైతులకు హామీ ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ కొందరికి వర్తించిందని ఇప్పుడు పంటసాయం ఎకరానికి మాత్రమే వేశారని ఆరోపించారు. రైతులకు సకాలంలో విత్తనాలు ఎరువులు ఇవ్వలేని ప్రభుత్వం కొనుగోలు కూడా చేపట్టకుండా నష్టం చేస్తుందని ఆరోపించారు. ప్రజలకు 6 గ్యారంటీలు 420 హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు తీయడం లేదని పేర్కొన్నారు అటువంటి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు.

## వినియోగదారులకు ఇబ్బంది కలగొద్దు

**కాగజ్‌నగర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా ఇంధన సరఫరా సక్రమంగా అందించాలని ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్ అన్నారు. కాగజ్ణగర్ మండల కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) పెట్రోల్ బంక్‌ను బుధవారం జీసీసీ ఉట్నూర్ డివిజనల్ మేనేజర్ సందీ ప్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. పెట్రోల్ బంక్‌లో జరుగుతున్న లావాదేవీలు, రిజిస్టర్లు, టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్, గాలి మిషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. పెట్రోల్ బంక్‌లో తాగునీరు, మూత్రశాలల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. ఇంధనం అవసరం మేరకు ముందస్తుగా తెప్పించుకోవాలని తెలిపారు. నోస్టాక్ బోర్డులు పెట్టవద్దని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు.



# సర్వేంద్రియానాం నయనం ప్రధానం

**రోడ్డుపై బాధ్యతగా వెళ్లండి - క్షేమంగా ఇంటికి తిరిగి రండి**
**100 మంది ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు - 'అరైవ్ అలైవ్ 2.0'లో భాగంగా కార్యక్రమం.**
**ఆటో డ్రైవర్లు తప్పకుండా యూనిఫామ్ ధరించాలి - ఆటోలలో డ్రైవర్ సీట్ పక్కన ఎవరు ఉండకూడదు.**
**ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి**

**ఆదిలాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు రాష్ట్ర డిజిపి డి శివధర్ రెడ్డి గారిచే ప్రారంభించబడిన "అరైవ్ అలైవ్ 2.0" కార్యక్రమం సందర్భంగా ఈరోజు మధ్యాహ్నం ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ గారి ఆదేశాల మేరకు ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎస్టియు భవన్ నందు పట్టణంలోని ఆటో డ్రైవర్లకు టాక్సీ డ్రైవర్లకు ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆదిలాబాద్ డిఎస్పి మాట్లాడుతూ డిఫెన్సివ్ డ్రైవింగ్ తో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ వాహన నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల లో ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్క ఆటో యజమాని "అభయ మై టాక్సీ ఇస్ సేఫ్" అనే కార్యక్రమంలో పాలు పంచుకోవాలని, దీని ద్వారా లక్ష రూపాయల ప్రమాద బీమా కల్పిస్తుందని తెలిపారు. డ్రైవర్లకు ఎలాంటి అనుమానాస్పద సమాచారం ఉన్న వెంటనే డయల్ 100 చేసి ద్వారా పోలీసులకు సమాచారం చేరవేయాలని తెలిపారు. ఈ ఉచిత కంటి పరీక్షల్లో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన 100 మంది ఆటో, టాక్సీ డ్రైవర్లు పాల్గొన్నట్లు తెలిపారు. వీరందరికీ ఆదిలాబాద్ లోని వైద్యులచే వైద్య పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. ఆటో డ్రైవర్లు తప్పకుండా యూనిఫామ్ ధరించాలని తెలిపారు. అదేవిధంగా ఆటో డ్రైవర్ సీటు పై డ్రైవర్ మాత్రమే ఉండేలా చూసుకోవాలని, డ్రైవర్ సీట్ పక్కన ఎవర్ని ఉంచరాదని తెలిపారు. డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని తెలియజేశారు. అదేవిధంగా పరిమితికి మించి ప్రయాణికులతో వాహనాలను నడపవద్దని తెలిపారు. ఆటోలు, వాహనాల ద్వారా నేరాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు సునీల్ కుమార్, కె నాగరాజు,కర్రె స్వామి, ప్రణయ్, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## నిరుపేదలకు అండగా ప్రభుత్వం

**మామడ, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
మామడ మండలంలోని దిమ్మదుర్తిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీహరిరావు లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేయించారు. నిరుపేదలకు ప్రభుత్వం ఆదుకుంటుందని, ఈ మేరకు బుధవారం గ్రామానికి చెందిన పొన్నం శ్వేత ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమరెడ్డి, మామడ మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకుల యాజమానులకు ఎస్సై కీలక సూచన

**కుభీర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
కుబీర్ మండలంలోని పెట్రోల్ బంకుల్లో బుధవారం పెట్రోల్ కొరత ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డీజిల్ దొరకకపోవడంతో ట్రాక్టర్లు వ్యవసాయ పనులకు కదలని పరిస్థితి వచ్చిందని ట్రాక్టర్ల యజమానులు వాపోతున్నారు. వాహనదారులు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పడుతుందని వదంతులతో మంగళవారం రాత్రికే బంకుల్లో వాహనదారులు క్యూ కట్టారు. ఎస్సై శ్రీనివాస్ బంకుల్లోకి వెళ్లి యాజమానులకు వాహనాల్లోనే పెట్రోల్ పోయాలని సూచించారు. బుధవారం పెట్రోల్ కోసం ఎదురు చూస్తున్నారు.

# హరితహారంలో నాటిన చెట్లు నరికివేత

**పరిశీలించిన ఎంపీడీవో**

**దిలావర్‌పూర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
దిలావర్పూర్ మండలంలోని కంజర్ గ్రామంలో గతంలో హరితహారంలో భాగంగా నాటిన చెట్లను ఇప్పుడు పూర్తిగా నరికి వేయడం జరిగిందని మాజీ సర్పంచ్ వినోద్ కుమార్ ఈ నెల 16వ తేదీన నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు నిర్మల్ జిల్లా కలెక్టర్ అభినవ్ అభిలాష ఆదేశానుసారం దిలావర్పూర్ ఎంపిడిఓ అరుణ రాణి ఈ రోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంపిడివో అరుణ రాణి మాట్లాడుతూ.. కలెక్టర్ కార్యాలయంలో వచ్చిన ఫిర్యాదు మేరకు రావడం జరిగిందని, చెట్లను పరిశీలించమని దీనిపై నివేదికను కలెక్టర్ కార్యక్రమంలో అందజేయడం జరుగుతుందని తెలిపారు. చెట్లు ఎక్కువగా పెరగడం వలన రోడ్డుపైకి కొమ్మలు వస్తున్నాయని అందువలన బస్సు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందని, రాత్రి వేళలో ద్విచక్ర వాహనాదారులు ఇబ్బంది పడుతున్నారని ప్రజా అవసరాల మేరకు చెట్ల కొమ్మలను తొలగించమని, చెట్లు ఎక్కువగా ఉన్న చోట పూర్తిగా తొలగించడం జరిగిందని సర్పంచ్ శేరు చందు ఎంపిడిఓకు వినతి పత్రం అందజేశారు.





## శ్రీ రాజరాజేశ్వర స్వామి ప్రతిష్టాపన

**రెబ్బెన, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
రెబ్బెన మండలం దేవాలగూడలో బుధవారం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో విగ్రహాలు, ధ్వజ శిఖర ప్రతిష్టాపన మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఐక్యత, భక్తి భావం పెరుగుతుందని తెలిపారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమ్మక్క కుటుంబానికి న్యాయం చేయాలి

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు**



**ఆసిఫాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో జరిగి న ఆదివాసీ యువతి ఆత్రం సమ్మక్క హత్య కేసుపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లో గోండ్వానా కోయ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోయం చిన్నయ్య, బాధితురాలి తల్లిదండ్రులు, సోదరితో కలిసి తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఫిర్యాదు చేశారు. హత్య కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి న్యాయం చేయాలని తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఫిర్యాదును స్వీకరించిన కమిషన్ చైర్మన్ బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, త్వరలో ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటిస్తామని తెలిపారు.

## హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు

**మంచిర్యాల, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
హజ్ యాత్రకు వెళ్ళే వారికి బుధవారం మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ అనిత, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వేదవ్యాస్, ఆర్ ఎం ఓ డాక్టర్ శ్రీధర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. హజ్ యాత్రకు వెళ్లే 17 మందికి అన్ని రకాల పరీక్షలు చేసిన తర్వాత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ముస్తాఫా, డాక్టర్ తాజ్మీయ, డిపిఓ ప్రశాంతి, డీఈఆర్వో బుక్క వెంకటేశ్వర్, జిల్లా వ్యాక్సినేషన్ మేనేజర్ అఖిల్ పాషా, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు, లింగారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్లు, ఎక్స్ రే టెక్నీషియన్లు, కోఆర్డినేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# లోలెవల్ వంతెనల స్థితిగతులు పరిశీలించాలి

**జైనూర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
అధికారులు ఎప్పటి కప్పుడు లోలెవల్ వంతెనల స్థితిగతులు పరిశీలించాలని కలెక్టర్ హరిత అన్నారు. లింగాపూర్, సిర్పూర్(యు), జైనూర్ మండలాల్లో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లింగాపూర్ మండలంలోని అల్లిగూడా నుంచి కొత్తపల్లి వరకు రోడ్డు పై ఉన్న లోలెవల్ వంతెనల స్థితిగతులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు. ఆయా ప్రాంతాల్లో హైలెవల్ వంతెనలు నిర్మించేందుకు ప్రతిపాదనలు వెంటనే పంపించాలని ఇంజినీరింగ్ అధి కారులను ఆదేశించారు. అనంతరం కంచన్‌పల్లి మురాగూడా గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్దిదారులతో మాట్లాడారు. సిర్పూర్(యు) మండలంలోగల మహాగాంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని అన్నారు. సిర్పూర్ మండల కేంద్రంలో గల కస్తూర్బా బాలికల విద్యాలయాని సందర్శించి భోజనం పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలని చెప్పారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. భోజనంలో తప్పనిసరిగా మెనూ పాటించాలని చెప్పారు. అనంతరం కోహనూర్ సిడంగూడా రోడ్డుపైగల బ్రిడ్జిను పరిశీలించారు. కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని చెప్పారు. జైనూర్ మండలంలోని గౌరి రోడ్డపైగల బ్రిడ్జిని పరిశీలించి కొత్తవాటికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ డీఈ ఫజిల్‌హక్, ఏఈ అరవింద్, ఘూనూర్ సర్పంచ్ శేషునారాయణ్ పాల్గొన్నారు.





# ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రత్యేక ప్రణాళిక

**షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి చర్యలు - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు, బెల్లంపల్లి సబ్-కలెక్టర్ మనోజ్, మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఎ.సి.పి.లు ప్రకాష్, కిరణ్ కుమార్, వెంకటేశ్వర్లు, షెడ్యూల్డ్ కులములు అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ లతో కలిసి పోలీస్, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులు, ఎస్.సి., ఎస్.టి. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో అట్రాసిటీ కేసులు, పరిష్కారం, బాధితులకు న్యాయం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న ఎస్.సి., ఎస్.టి. సమస్యలను పరిష్కరించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్. సి., ఎస్. టి. అభివృద్ధి, కేసులు, ఎన్ ఫోర్స్ మెంట్ అమలు అంశాలపై తీసుకుంటున్న చర్యలపై సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎస్.సి., ఎస్.టి.లకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఇండ్లు నిర్మించుకోలేని వారికి గుత్తేదారుల సమన్వయంతో ఇల్లు నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాలు, ఆసుపత్రులు తదితర సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రగతికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. దండేపల్లిలోని పి వి టి జి, తాండూర్‌లో ఎస్.టి. వసతి గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, గురుకులాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలలో అందరికీ అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. పోలీసు శాఖ పరిధిలోని అట్రాసిటీ కేసులు కార్యచరణ ప్రకారంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. అట్రాసిటీ కేసులలో తప్పుడు కేసులు నమోదు చేసిన వాటి వివరాలను స్పష్టంగా రికార్డులలో నమోదు చేయాలని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ కేసులలో ఫిర్యాదుదారులు చేసిన ఫిర్యాదులో వివరాలు సక్రమంగా ఉన్నట్లయితే సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2023 డిసెంబర్ వరకు నమోదైన కేసులలో బాధితులకు గత సంవత్సరం 1 కోటి 34 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించడం జరిగిందని తెలిపారు. ప్రతి నెల నిర్వహించే పౌర హక్కుల దినోత్సవం నిర్వహణలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, పౌర హక్కుల పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. గంజాయి, నిషేధిత మాదకద్రవ్యాల వినియోగం పై ప్రత్యేక నిఘా చేపట్టాలని, జిల్లాలో క్రయ విక్రయాలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు ఉపకార వేతనాల మంజూరు పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, నాణ్యమైన విద్య బోధన అందించే విధంగా కృషి చేయాలని తెలిపారు. పారిశుధ్యం, త్రాగునీరు ఇతర ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల నియంత్రణపై ఎస్సి, ఎస్టిలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాలను గ్రామపంచాయతీలలో నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరికి హక్కులపై అవగాహన కలుగుతుందని తెలిపారు. 2025 సంవత్సరంలో 117 అట్రాసిటీ కేసులు నమోదు అయ్యాయని, కేసుల పరిష్కారంలో సాంకేతికతను ఉపయోగిస్తున్నామని, సరైన ఆధారాలు సేకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.సి., ఎస్.టి. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దమ్మ నారాయణ, చిలుక రాజనర్సు, బెక్కం రాజారావు, దుర్గం ఎల్లయ్య, పెద్ది రాజన్న, జిల్లా పౌర సంబంధాల అధికారి యం.కృష్ణమూర్తి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, ఎ.టి.డి.ఓ. సురేష్, కలెక్టరేట్ బి విభాగం పర్యవేక్షకులు మధుసూదన్, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### మంచిర్యాల జిల్లా
## పెరిక సంఘం కార్యవర్గం

**జన్నారం, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా పెరిక సంఘం ఉపాధ్యక్షులుగా నియమితులైన జన్నారం మండలానికి చెందిన ముత్యం సతీష్ మరియు దాసరి తిరుపతికి సన్మానం చేయడం జరిగింది. సన్మాన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముజాఫర్ అలీఖాన్ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు భరత్ కుమార్ జన్నారం పెరిక సంఘం గౌరవ అధ్యక్షులు వెంబడి సత్తన్న ప్రధాన కార్యదర్శి గూడా అశోక్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు కుదిరి వెంకన్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముత్యం రాజన్న యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి గణేష్ ఫోన్కాల్ టౌన్ అధ్యక్షుడు ధూమల్ల రమేష్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మామిడిపల్లి ఇందయ కృష్ణారావు సర్పంచ్ రాజ్ కుమార్ తదితరులు సన్మానం చేయడం జరిగింది.

## ఇసుక దుర్వినియోగం చేస్తే చర్యలు

**లింగాపూర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అందించే ఉచిత ఇసుకను ఇతర పనులకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హరిత హెచ్చరించారు. కెరమెరి మండలంలోని అనార్పల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఆపి రసీదులను పరిశీలించారు. ఆర్డీఓ లోకేశ్వర్ రావు, జైనూర్, కెరమెరి తహసీల్దార్లకు సమాచారం ఇచ్చి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



## 30 వేల కోట్ల ఆదాయం.. తిరిగి 150 కోట్లు మాత్రమే?

**కేంద్రాన్ని ప్రశ్నించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

**బెల్లంపల్లి, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం కేంద్రానికి భారీగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, తిరిగి రాష్ట్రానికి తగిన మేర నిధులు అందడం లేదని ఆయన విమర్శించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం కేంద్రానికి ఇచ్చే ప్రతి రూపాయికి కేవలం 30 పైసలే తిరిగి అందుతున్నాయని పేర్కొన్నారు. ఇది తెలంగాణకు జరుగుతున్న అన్యాయమని ఆయన అభిప్రాయపడ్డారు. పెద్దపల్లి నియోజకవర్గం దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా ఉందని ఆయన వివరించారు. సింగరేణి వంటి సంస్థల ద్వారా సంవత్సరానికి సుమారు 25,000 కోట్ల నుంచి30,000 కోట్ల వరకు కేంద్రానికి ఆదాయం సమకూరుతోందని చెప్పారు. అయినప్పటికీ, ఈ ప్రాంత అభివృద్ధికి కేటాయిస్తున్న నిధులు కేవలం 100 నుంచి 150 కోట్ల వరకు మాత్రమే ఉండటం విచారకరమని అన్నారు. ప్రాంత అభివృద్ధి కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయం, గనుల విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని పలుమార్లు కోరినట్లు తెలిపారు. అదేవిధంగా, సింగరేణి కార్మికుల కోసం ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అయితే, ఈ ప్రాజెక్టులకు ఇప్పటివరకు కేంద్రం నుంచి సరైన స్పందన రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు తగిన న్యాయం చేయాలని, రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.



## మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో కొనసాగుతున్న మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని మహిళా సమాఖ్యల కొరకు చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## రెండు బైక్ లు ఢీకొని ఒకరు మృతి

**సోన్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
సోన్ మండలం పాక్ పట్ల గ్రామంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బండారి శ్రీను అనే వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. గాంధీనగర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రయాణిస్తున్న బైక్‌ను పాక్ పట్ల గ్రామానికి చెందిన శ్రీను, నాని ప్రయాణిస్తున్న బైక్ ఢీకొట్టింది. శ్రీను తలకు గాయాలు కావడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.






## స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

**ఆసిఫాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా గురువారం చేపట్టే డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ప్రొఫెషనల్ కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్లేకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ విద్యారంగానికి తగిన నిధులు కేటాయించకుండా ప్రభుత్వం విద్యార్థులను మోసం చేస్తోందని విమర్శించారు. విద్యార్థులకు సంబంధించిన రూ.10 వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్లో ఉన్నాయని, దీంతో విద్యార్థులు సర్టిఫికెట్లు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఐఎఫ్ ఖాన్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు షేక్ సమీర్, మండల కార్యదర్శి జగజంపుల ప్రశాంత్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రి కొడుకులకు గాయాలు

**మంచిర్యాల, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
సిసిసి నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో, భీమిని మండలానికి చెందిన రాచకొండ భీమేష్, అతని తండ్రి రాచకొండ బాబు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. శ్రీరాంపూర్ నుండి స్వగ్రామానికి బైక్ పై తిరిగి వెళ్తుండగా, దొరగారిపల్లి గ్రామ సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ వారిని ఢీకొట్టింది. దీంతో వారిద్దరికి తీవ్రగాయాలయ్యాయి.. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

# 'పండోక్న మహాభారత్' పుస్తకావిష్కరణ

**ఆదిలాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
తమదైన ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలకు పెట్టింది పేరైన గిరిజన లోకంలో మరో అపురూప సాహిత్య ఘట్టం ఆవిష్కృతమైంది. గోండీ భాషా సౌరభాన్ని, భారతీయ పురాణ గాథలను మేళవిస్తూ రూపొందించిన 'పండోక్న మహాభారత్' పుస్తకావిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. గిరిజన ఆచారాలు, వారి జీవనశైలిని ప్రతిబింబిస్తూ, మాతృభాషలో మహాభారత ఘట్టాలను ప్రజలకు చేరువ చేసే ఉద్దేశంతో వెలువడిన ఈ గ్రంథం పట్ల సాహిత్య ప్రియులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసీల ఆత్మగౌరవానికి, వారి భాషా వికాసానికి ఈ పుస్తకం ఒక నిలువుటద్దంలా నిలుస్తుందని సభలో పాల్గొన్న ప్రముఖులు అభిప్రాయపడ్డారు.. ఢిల్లీలో నిర్వహిస్తున్న 10వ జాతీయ జనజాతి, లోక్ సంస్కృతి సాహిత్య ఉత్స వంలో బుధవారం మావల మండలం వాఘాపూర్‌కు చెందిన తొడసం కైలాష్ మాస్టర్ దేవనాగరి లిపిలో రాసిన పండోక్న మహాభారత్ కథ పుస్తకాన్ని కేంద్రమంత్రి గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి దుర్గాదాస్ ఉయికే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కైలాష్ మాట్లాడుతూ మహాభారతంలో తాను 2024లో తెలుగు లిపితో గోండిభాషలో ఈ పుస్త కాన్ని రచించి ప్రచురించినట్లు తెలిపారు. మహారాష్ట్రలోని కొందరు హిందీ లిపిలో రాస్తే మాకు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. రెండు నెలల్లో తెలుగు లిపిలో ఉన్న



ఈ పండోక్న మహాభారత్ కథ పుస్తకాన్ని దేవనాగరి హిందీ లిపి లో కన్వర్ట్ చేసినట్లు తెలిపారు. గోండిభాషలో అమెజాన్ విడుదలైన తొలి పుస్తకంగా నిలిచిందని పేర్కొన్నా రు. ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ కళానిధి విభాగం ఢిల్లీ, ఇందిరాగాంధీ రాష్ట్రీయ మానవ సంగ్రహాల యం భోపాల్‌తో సంయుక్తంగా కార్యక్రమం కొనసాగింది. జిల్లా రచయితలు డాక్టర్ మెస్రం మనోహర్ పాల్గొన్నారు.



### ఆంగ్ల అభ్యాసంలో
## విద్యార్థి అగ్రస్థానం

**వాంకిడి, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
ఆంగ్ల అభ్యాసంలో వాంకిడి మండలం చౌపన్ గూడ ఆశ్రమ పాఠశాలకు చెందిన మూడవ తరగతి విద్యార్థి సిడాం భీంరా వ్ అగ్రస్థానం పొందినట్లు పాఠ శాల ప్రధానోపాధ్యా యుడు మనోహర్ తెలిపారు. ఉట్నూర్‌లో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆంగ్ల నైపుణ్యాల అభివృద్ధి కోసం సంస్థ నిర్వహించిన వాంకిడి మండలం చౌపన్ గూడ గ్రామంలోని ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ సోషల్ లెర్నింగ్ సెంటర్ ఆశ్రమ పాఠశాలకు చెందిన మూడవ తరగతి విద్యార్థి సిడాం భీంరా వ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ లో ప్రథమ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా (ఐటిడిఏ) ఉట్నూర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ చేతులమీదుగా బుధవారం భీంరావ్‌కు ప్రథమ బహుమ తిగా సైకిల్, స్టడీ చైర్, స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె. మనోహర్, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థి ప్రతిభపై హెచ్ఎం కె. మనోహర్, సబ్జెక్ట్ టీచర్ ఆర్. రాజేష్ అభినందనలు తెలియ జేస్తూ, భవిష్యత్తులో మరింత ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షిం చారు. ఈ విజయంతో పాఠశాలకు మంచి పేరు తీసుకువ చ్చాడని పేర్కొన్నారు.

## వ్యాలిడిషన్ యాక్ట్‌ను రద్దు చేయాలి



**నిర్మల్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ నిర్మల్ నిర్మల్ జిల్లా. 25 మార్చి 2025న. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి. ఆర్థిక సంస్కరణల బిల్లు పేరట వ్యాలిడిషన్ రద్దు చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు ఎంసీ లింగన్న డిమాండ్ చేశారు. దేశంలోని లక్షణాధిమంది రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ పెన్షన్ల యొక్క ఆర్థిక అస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా ప్రవేశ పెట్టిన చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ తిరుమలలో ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. దేశవ్యాప్తంగా లక్షలాదిమందిగా నల్ల బ్యాడ్జీలు ధరించి. నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గౌజ్జ జనార్ధన్ నేతృత్వంలో జిల్లా బాధ్యులు లోలం గంగన్న డాక్టర్ నాగేశ్వరరావు, కరీం కోనపోశెట్టి. డాక్టర్ రజిని. రామా గౌడ్. ఏం రాజేశ్వర్. యూనిట్ బాధ్యులు, ప్రాథమిక సభ్యులు నిర్మల్ అదనపు కలెక్టర్ కిషోర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు.

## ఊపందుకున్న ఆయిల్ పామ్ సాగు

**రెబ్బెన, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 1650 ఎకరాలు సాగులోకి వచ్చించి. దీని కోసం ఉద్యాన శాఖ ద్వారా రైతులకు శిక్షణ కార్యక్రమాలు, క్షేత్ర పర్యటనలు నిర్వహిస్తున్నారు. రైతులకు అవగాహన కల్పించిన అనంతరం రైతులు ఆసక్తిగా సాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి అబ్దుల్ నదీమ్ తెలిపారు. ఆయిల్ పామ్ సాగు కోసం ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అనేక రాయితీలను అందిస్తుంది దీంతో సాగు పెరిగింది.

## శోభాయాత్ర బందోబస్తుపై జిల్లా ఎస్పీ సమీక్ష

**నిర్మల్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
శ్రీరామ నవమి సందర్భంగా నిర్మల్ జిల్లాలో నిర్వహించే శోభాయాత్ర బందోబస్తుపై జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిల బుధవారం పోలీసు అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక పహారా, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు.




## గ్రామాభివృద్ధికే ప్రథమ ప్రాధాన్యం



**వాంకిడి, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
గ్రామాల అభివృద్ధే తమ ముఖ్య లక్ష్యమని కమాన గ్రామ సర్పంచ్ సునీత పేర్కొన్నారు. బుధవారం వాంకిడి మండలం కమాన గ్రామపంచాయతీ పరిధిలోని పూనాగూడా నుండి బోడం కప్పి వరకు ఉపాధి హామీ పథకం కింద రూ.3.50 లక్షల నిధులతో మంజూరైన రోడ్డు నిర్మాణ పనులను ఉప సర్పంచ్ లాహుకుమార్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం చేయ డం, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం తమ లక్ష్యమని తెలిపారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సులభంగా మార్కెట్‌కు తరలించుకునే విధంగా ఈ రహదారి ఉప యోగపడుతుందని పేర్కొన్నారు. పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఉప సర్పంచ్ లాహు కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతుండటంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తున్నా యని తెలిపారు. గ్రామస్తులు పనులపై హర్షం వ్యక్తం చేస్తూ, రహదారి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబా టులోకి తేవాలని కోరారు.

## కాసిపేట మండలంలో యువతిపై దాడి

**కాసిపేట, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం రొట్టెపల్లి గ్రామంలో ఓ మహిళపై ప్రేమ వివాహం విషయంలో తలెత్తిన విభేదాలు దాడికి దారితీసిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. దేవాపూర్ ఎస్సై గంగారాం తెలిపిన వివరాల ప్రకారం... రొట్టపల్లి గ్రామానికి చెందిన పోగుల అక్షిత్ కుమార్, అదే గ్రామానికి చెందిన అలక అక్షిత ప్రేమించుకున్నారు. ఇంటి నుంచి వెళ్లిపోయా రు. రహస్యంగా ప్రేమ వివాహం చేసుకున్నారునీ సమాచారం.. దీన్ని మనసులో పెట్టుకొని అక్షిత్ కుమార్ సోదరి సదాపై అమ్మాయి అలక పెద్దులు, రాజు, ప్రశాంత్ వారి బంధువులు కలిసి దాడి చేసి కొట్టారు. ఈ సంఘటనలో గాయపడిన సదాను హుటాహుటిన బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.







### విధుల కేటాయింపులు
## సీనియార్టీకి ప్రాధాన్యత ఇవ్వాలి

**నిర్మల్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
త్వరలో జరగనున్న మొదటి దశ జనగణన (సెన్సెస్)లో భాగంగా చేపట్టనున్న హౌస్ లిస్టింగ్ సర్వేలో ఉపాధ్యాయులకు విధుల కేటాయింపులో సీనియారిటీ పాటించాలని సోన్ మండల తహసిల్దార్ కే.మల్లేష్ రెడ్డికి వినతిపత్రం అందించారు. సెన్సెస్ విధుల కేటాయింపు మార్గదర్శకాలకు అనుగుణంగా కేటాయిస్తూ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, అందుకు పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు తోడిశెట్టి రవికాంత్, రాపర్తి అశోక్ కుమార్, భూమారెడ్డి, కుంట సాయికుమార్, నర్సయ్య, చల్లా గోవర్ధన్, రవీందర్ గౌడ్, కుర్మే నాగయ్య, శ్రీధర్, బాపు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**నిర్మల్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని శ్యాం ఘడ్ ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందడం కలకలం రేపింది. ముఖంపై గాయాలు ఉండడంతో.. ఎవరైనా హత్య చేశారన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. వివరాల్లోకి వెళితే... శ్యామ్ ఘడ్ కోట వెనకాల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు బుధవారం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మహా రాష్ట్రలోని కిన్వట్ కు చెందిన పోలే గజానంద్ (36)గా గుర్తించారు. గత పది సంవత్సరాల నుండి నిర్మల్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ.. జీవం సాగిస్తున్నాడు. భార్య ఇతన్ని వదిలివేయడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈక్రమంలో శ్యామ్ ఘడ్ కోట వద్ద ముఖంపై గాయాలు, రక్తంతో ఉండడంతో ఎవరైన హత్య చేసి ఉంటారని పోలీసులు బావిస్తున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు హత్య, అనుమానాస్పదం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణ తెలిపారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు


**నిర్మల్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
తల్వేద గ్రామంలో జిల్లా పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల 8 వ విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని గేదెలు, ఆవులు, దూడలకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధి ఒక అంటూ వ్యాధి, ఇది పీకోర్న వైరస్ వలన సోకుతుందని మన రాష్ట్రంలో ఎక్కువగా అనే స్ట్రైన్ వల్ల విస్తరిస్తుందని ఈ వ్యాధి సోకడం వల్ల మరణాల శాతం తక్కువగా ఉన్న పశువుల్లో పాల ఉత్పాదక శక్తి, పునరుత్పత్తి శక్తి సామర్థ్యం కుంటుపడుతుందని ఈ వ్యాధి దేశవాళీ పశువుల కంటే సంకరజాతి పశువుల ఎక్కువగా ఉంటుందని పశువైద్యులు తెలిపారు.



# విజయ్ సినిమాకు బిగ్ షాక్



కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ కథానాయకుడిగా నటించిన పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'జన నాయగన్'. హెచ్ వినోద్ డైరెక్ట్ చేశారు. తెలుగు సూపర్ హిట్ ఫిల్మ్ `భగవంత్ కేసరి` ఆధారంగా దీన్ని కొంత మార్పులు చేర్పులు చేసి విజయ్ క్రేజ్‌కి తగ్గట్టుగా రూపొందించారు. జనవరి 9న రిలీజ్ చేయాలని పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనుకున్నారు. విజయ్ క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశిస్తూ చేసిన ఆఖరి సినిమా కావడంతో దీనిపై సహజంగానే ప్రేక్షకుల్లో, అభిమానుల్లో అంచనాలు ఏర్పడ్డాయి.అయితే జనవరి 9న భారీ స్థాయిలో రిలీజ్ అవుతుందని, తమ ప్రియమైన స్టార్‌కు ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్‌తో గ్రాండ్‌గా ఫెయిర్‌వెల్ ఇవ్వాలని భావించిన వారికి సీబీఎఫ్‌సీ వర్గాలు షాక్ ఇవ్వడం, సినిమా రిలీజ్ వాయిదాపడటం తెలిసిందే. అప్పటి నుంచి ఈ మూవీ రిలీజ్‌పై భిన్నకథనాలు వినిపిస్తున్నా సెన్సార్ వారి నుంచి ఇంత వరకు ఎలాంటి క్లియరెన్స్ రాకపోవడంతో ఇప్పట్లో 'జన నాయగన్' థియేటర్లలోకి రావడం కష్టమనే సంకేతాలు వినిపిస్తున్నాయి.సెన్సార్ వారికి వ్యతిరేకంగా మేకర్స్ చెన్నై హైకోర్టుని సంప్రదించడంతో వివాదం తారా స్థాయికి చేరింది. అయితే తాజాగా వారు సూచించిన కట్స్‌కు టీమ్ అంగీకరించి కేసు విత్‌డ్రా చేసుకోవడంతో సినిమా రివైజింగ్ కమిటీ ముందుకు వెళ్లింది. ఇదే ఇప్పుడు విజయ్ సినిమాకు ఇబ్బందికరంగా మారినట్టుగా తెలుస్తోంది. ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ హక్కుల్ని రూ.121 కోట్లకు అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. శాటిలైట్ హక్కుల్ని రూ.64 కోట్లకు జీ తమిల్ ఛానల్ దక్కించుకుంది. అయితే ఓటీటీ స్ట్రీమింగ్ హక్కుల విషయంలోనే ఇప్పుడు అతిపెద్ద షాక్ ఈ సినిమా మేకర్స్‌కు తగలనున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. సినిమా రిలీజ్ దాదాపు మూడు నెలలుగా వాయిదాపడుతూ వస్తుండటం, ఎప్పుడు రిలీజ్ అవుతుందో క్లారిటీ లేకపోవడంతో ఓటీటీ దిగ్గజం అమెజాన్ ప్రైమ్ వీడియో మేకర్స్‌కి షాక్ ఇస్తున్నట్టుగా చెబుతున్నారు. సినిమా రిలీజ్‌కు ముందే భారీ డీల్‌ని క్లోజ్ చేసుకునే క్రమంలో అగ్రిమెంట్ చేసుకున్న అమెజాన్ ప్రైమ్ వీడియో వర్గాలు ఆ అగ్రిమెంట్‌ని క్యాన్సిల్ చేసుకోవాలనే ప్లాన్‌లో ఉన్నారని కోలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది.





# రజనీకాంత్ కోసం 83 గెటప్‌లు..

టాలెంటెడ్ హీరో శివకార్తికేయన్‌తో `డాన్` మూవీని రూపొందించిన దర్శకుడు సిబి చక్రవర్తి. తొలి సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకోవడమే కాకుండా ఈ సినిమాతో బాక్సాఫీస్ వద్ద రూ.120 కోట్లు రాబట్టి అందరిని ఆశ్చర్యపరిచాడు. ఎస్.జె. సూర్య, సముద్రఖని కీలక పాత్రల్లో నటించగా ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటించింది. ఈ మూవీతో తమిళ ఇండస్ట్రీ వర్గాల దృష్టిని ఆకర్షించిన సిబి ఎవరూ ఊహించని విధంగా సూపర్‌స్టార్ రజనీకాంత్‌ని డైరెక్ట్ చేసే ఛాన్స్‌ని సొంతం చేసుకుని అందరిని షాక్‌కు గురి చేశాడు.కమల్ హాసన్ రాజ్ కమల్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై సూపర్ స్టార్ రజనీకాంత్‌తో ఓ సోలో మూవీని నిర్మించాలని ప్లాన్ చేయడం దానికి సుందర్ సిని డైరెక్టర్‌గా ప్రకటించడం తెలిసిందే. ఈ మూవీ ప్రారంభం కాకుండానే ఈ ప్రాజెక్ట్ నుంచి సుందర్ సి తప్పుకుని షాక్ ఇచ్చాడు. దీంతో కమల్ ఆ స్థానంలో మరో డైరెక్టర్ కోసం అన్వేషించి ఫైనల్‌గా శివకార్తికేయన్ డైరెక్టర్ సిబి చక్రవర్తిని ఫైనల్ చేసుకోవడం తెలిసిందే. ఒక సినిమా అనుభవం ఉన్న డైరెక్టర్‌ని రజనీ సినిమాకు తీసుకున్నారేంటీ అనే సందేహాలు సర్వత్రా వినిపించాయి.చాలా మంది చాలా డౌట్‌లు రైజ్ చేశారు కూడా. అయితే ఇవేవీ కమల్ పట్టించుకోకుండా సిబికి దర్శకత్వ బాధ్యతలు అప్పగించి దీనికి సంబంధించిన పనులు ఫాస్ట్‌గా మొదలు పెట్టమని చెప్పారట. ఇంకేముందీ మనోడు జెట్ స్పీడుతో ప్రీ ప్రొడక్షన్ వర్క్ మొదలు పెట్టేశాడు. అంతేనా రజనీతో సినిమా కావడంతో హార్డ్ వర్క్ చేస్తున్నాడట. గెటప్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుని ఫైనల్‌గా 83 గెటప్‌లని రెడీ చేయించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సినిమాలో రజనీ గెటప్‌కే ఇంత హార్డ్ వర్క్ చేస్తే సినిమా విషయంలో సిబి ఏ రేంజ్‌లో శ్రమిస్తాడో అనే చర్చ కోలీవుడ్‌లో జరుగుతోంది.

సినిమా ప్రారంభానికి ముందే రజనీ లుక్ టెస్ట్ కోసం ఏకంగా ఒకటి కాదు రెండు కాదు 83 గెటప్‌లని రెడీ చేయించిన సిబి అందులో మూడింటిని ఫైనల్ చేసి కమల్‌కు పంపించాడట. వాటిలో ఒక గెటప్‌ని కమల్, రజనీ ఫైనల్ చేస్తారని తెలుస్తోంది. రజనీ ప్రస్తుతం `జైలర్ 2` షూటింగ్‌లో బిజీ బిజీగా గడిపేస్తున్నారు. దీని షూటింగ్ పూర్తయిన తరువాత కమల్‌తో కలిసి చేయనున్న మల్టీస్టారర్‌కు డేట్స్ కేటాయిస్తారు. అదే సమయంలో సిబి చక్రవర్తి డైరెక్షన్‌లో తాను చేయనున్న 173వ ప్రాజెక్ట్‌కు టైమ్ కేటాయిస్తారట. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ని సమ్మర్‌లో లాంఛనంగా పట్టాలెక్కించాలని కమల్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసిన సిబి షూటింగ్‌కు సిద్ధమవుతున్నట్టుగా చెబుతున్నారు.

# ‘సీతారామం’తోనే గ్లోబల్ గుర్తింపు

దర్శకులు మిమ్మల్ని దృష్టిలో పెట్టుకుని స్క్రిప్ట్‌లు రాశామని చెప్పడమే అతి పెద్ద అవార్డు అంటోంది కథానాయిక మృణాల్ ఠాకూర్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె హిందీ చిత్రసీమ వెలుపల గుర్తింపు పొందడం గురించి పలు ఆసక్తికరమైన సంగతుల్ని పంచుకుంది. “చిత్రపరిశ్రమలో నేను ఒక్కో మెట్టు ఎక్కుతూ వస్తున్నాను. బహుశా ఇండస్ట్రీ తొలినాళ్లలో నటన పరంగా నేను రెడీగా లేనేమో. కానీ, ఇప్పుడు నేను పూర్తిగా సిద్ధంగా ఉన్నాను. మిమ్మల్ని దృష్టిలో పెట్టుకుని స్క్రిప్ట్ రాశామని దర్శకులు చెప్పడమే నాకు దక్కిన అతిపెద్ద పురస్కారం. నిజమే నేను చేసిన మొదటి తెలుగు సినిమా ‘సీతారామం’ బ్లాక్ బస్టర్ అయింది. దాంతో నటిగా నాకు దక్షిణాదిలో మంచి గుర్తింపు దొరికింది. ఆ విధంగానే ప్రంపంచవ్యాప్తంగా ఆదరణ పొందాను. ఇప్పుడు నేను చేస్తున్న ‘డెకాయిట్’ చిత్రాన్ని తెలుగు, హిందీలో తెరకెక్కిస్తున్నారు. ముందుగా సన్నివేశాల్ని హిందీలో రిహార్సల్ చేయాలనుకునేదాన్ని. ఇప్పుడీ విషయంలో కొంచెం మెరుగుపడ్డాన”ని చెప్పుకొచ్చింది. త్వరలోనే ‘డెకాయిట్’ చిత్రంలో అడివి శేష్ సరసన తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవుతుంది మృణాల్

# ప్రజాతీర్పును గౌరవించి ఎన్నిక నిర్వహించాలి



- అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గం
- కాంగ్రెస్ సర్కారుకు గుణపాఠం తప్పదు
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**రామకృష్ణాపూర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజా తీర్పును మంత్రి వివేకానందతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవించి, ఎన్నిక నిర్వహించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక సందర్భంగా నమోదైన కేసులో న్యాయస్థానం తీర్పు మేరకు షరతులతో కూడిన బెయిల్ మంజూరుకాగా బుధవారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌కు ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ నాయకులు రామిడి కుమార్, కుర్మ దినేశ్, మహేందర్, బెల్లం అరుణ్, సీపెల్లి సాగర్, ఆర్నే సమ్మయ్య, మద్ది శంకర్, కొంగల తిరుపతిరెడ్డి సుదర్శన్ సంతకం వచ్చి సంతకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఫిబ్రవరి 16న కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి వివేకానంద వందల మంది పోలీసు బలగాలను దింపి పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి గెలిచిన బీఆర్ఎస్, సీపీఐ కౌన్సిలర్లను కౌన్సిల్ హాల్‌కు రాకుండా అడ్డుకున్నారని, మరుసటి రోజు కూడా అడ్డుకున్నప్పటికీ కౌన్సిలర్లు హాల్‌కు వచ్చారని తెలిపారు. ఎక్స్అఫీషియో ఓటు వేసేందుకని వచ్చిన మంత్రి వివేకానంద, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ కనుసైగలతోనే కాంగ్రెస్ కౌన్సిలర్లను బీఆర్ఎస్, సీపీఐ కౌన్సిలర్లపైకి దాడికి ఉసిగొల్పారని, మహిళా కౌన్సిలర్ల పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తించి గొడవ చేయించారని, దీంతో ఎన్నిక వాయిదా వేయించారని ఆరోపించారు. రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జివద్ద బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు రాళ్లు వేయడం, పోలీసులు లాఠీచార్జి చేయడం, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ చెన్నూరు ఎమ్మెల్యే, విప్ బాల్క సుమన్‌తో పాటు తనతో పాటు 25 మందిపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపైనా అక్రమంగా కేసులు బనాయించి జైలుకు పంపించడం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహించాలని ఈ నెల 24 వరకూ ఇచ్చిన హైకోర్టు గడువు కూడా ముగిసిందన్నారు. హైకోర్టు ఆదేశాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం బేఖాతర్ చేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా ఎన్నిక నిర్వహించకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర గవర్నర్‌కు విన్నవించనున్నట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నా కోర్టు తీర్పును గౌరవించి రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో సంతకం చేసినట్లు తెలిపారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామిడి కుమార్, కుర్మ దినేశ్, కోవ లక్ష్మి, మహేందర్, బెల్లం అరుణ్, సీపెల్లి సాగర్, ఆర్నే సమ్మయ్య, మద్ది శంకర్, కొంగల తిరుపతిరెడ్డి, సుదర్శన్, రామిడి లక్ష్మీకాంత్, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

## బైక్‌లో చెలరేగిన మంటలు

**జైపూర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
మండలం ఇందారం హెచ్పీ పెట్రోల్ బంక్ సమీపంలో రాజీవ్ రహదారిలో బుధ వారం మధ్యాహ్నం బైక్ అగ్ని ప్రమాదానికి గురైంది. శ్రీరాంపూర్ నుంచి బైక్ గోదావరిఖనికి చెందిన వ్యక్తులు వెళ్తున్నారు. ఇందారం సమీపంలో పెట్రోల్ బంక్లో పెట్రోల్ పోయిం చుకుని గోదావరిఖని వైపు వెళ్తుండగా బైక్‌లో ఒక్కసారిగా మం టలు చెలరేగాయి. బైక్‌ను ఆపగా స్థానికులు అటుగా వెళ్తున్న ఆర్ఎంసీ లారీలో ఉన్న నీటితో మంటలార్పివే శారు. అప్పటికే కొంతమేర బైక్ కాలిపోయింది.

## పిచ్చి కుక్కకాటుతో ఆవులు మృతి

**గుడిహత్నూర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
మండలంలోని గురుజ గ్రామంలో బుధవారం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. ఆవులు, దూడలపై కాటే యగా, నాలుగు ఆవులు మృత్యువాత పడ్డాయి. గాయ పడిన వాటికి పశు వైద్యుడు శ్రీకాంత్ చికిత్స అందిం చారు. అయితే కాటుకు గురైన ఆవు పాలు తాగిన వా రు చికిత్స తీసుకోవాలని సూచిం చారు. ఆవు పాలు తా గిన వారు 70 మంది వరకు ఆందోళన చెందుతున్నా రు. మరికొందరు ఏం కాదులే.. అంటున్నారు.

## డిగ్రీ కళాశాలలో ఫేర్వెల్ డే

**ఆదిలాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో ఫెరవల్ డే కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. 2023-26 బ్యాచ్ సీనియర్లకు జూనియర్లు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో జూనియర్లు నృత్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకోగా, సీనియర్లు ర్యాంప్ వాక్ నిర్వహించి సందడి చేశారు. అనంతరం మూడేళ్లపాటు విద్య బుద్ధులు నేర్పించిన అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంగీత, అద్యాపకులు జగ్గరాం, సంతోష్, అరుణ్ కుమార్, శ్రావణి, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి రహిత జిల్లాగా మార్చాలి

- ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలి
- మండలంలో నేరాల నియంత్రణకు గస్తీ నిర్వహించాలి
- ఇచ్చోడ పోలీస్ స్టేషన్ పరిశీలన
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్




**ఇచ్చోడ, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
ఇచ్చోడ మండల వ్యాప్తంగా ప్రతి ఒక్క గ్రామం నందు సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలను ప్రోత్సహిస్తూ సీసీటీవీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. ఈరోజు ఆకస్మికంగా ఇచ్చోడ పోలీస్ స్టేషన్ను పరిశీలించిన జిల్లా ఎస్పీ సిబ్బందిని ఉద్దేశించి పలు సూచనలు చేశారు. జిల్లాను గంజాయి రహిత జిల్లాగా నిర్మించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ప్రతి గ్రామం నందు గంజాయి వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ యువతను చైతన్యపరచాలని తెలిపారు. గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో మంచి సత్సంబంధాలను ఏర్పరచుకోవాలని తెలిపారు. గ్రామాలలో ప్రజలు స్వచ్ఛందంగా సిసిటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా, సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేయాలన్నారు. నేరాలు జరగకుండా మరియు జరిగిన నేరాలను త్వరితగతిన ఛేదించడానికి సీసీటీవీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. మండలంలో ఆర్థిక నేరాలు, దొంగతనాలు జరగకుండా పటిష్టమైన గస్తీ నిర్వహించాలని తెలిపారు. ఇచ్చోడ పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి కేసును నందు శిక్షలు పడే విధంగా దర్యాప్తు కొనసాగించాలని తెలిపారు. తప్పు చేసిన ప్రతి ఒక్క నేరస్తునికి శిక్ష కచ్చితంగా పడేవిధంగా పరిశోధన జరగాలని సూచించారు. పట్టణంలో రోడ్డు ప్రమాదాలపై, ప్రజలకు హెల్మెట్ యొక్క ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు వారం రోజులపాటుగా "అరైవ్ అలైవ్ 2.0" లో భాగంగా పలు ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసులకు తమ పూర్తి సహాయ సహకారాలను అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, ఇచ్చోడా సీఐ బండారి రాజు, ఎస్సై నారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిత్య జీవితంలో భగవద్గీత జీవన మార్గదర్శి

**ఆదిలాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
భగవద్గీత కేవలం ఒక మత గ్రంథం మాత్రమే కాదని, అది నిత్య జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడానికి, లక్ష్య సాధన కు గొప్ప మార్గదర్శిగా నిలుస్తుందని గిరిజన బాలుర డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు ఎన్. శిరీష అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన విస్తృత ఉపన్యాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థి దశలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి భగవద్గీత లోని అంశాలు ఏవిధంగా తోడ్పడతాయో, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అతిక్ బేగం, తెలుగు అధ్యాపకుడు నరేశ్, కో ఆర్డినేటర్ పృథ్వీ, విద్యార్థులు పాల్గొన్నారు.



# పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**

**జన్నారం, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ నిర్వహణలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అద నపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని జన్నారం మండలం పొనకల్ గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కొనసాగుతున్న పారిశుధ్యం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సంద ర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారి శుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామంలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువ వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ప్రజలకు శుద్ధమైన త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు పథకాల అమలు తీరును పరిశీలించి లబ్ధిదారులు నిబంధనల ప్రకారం ఇండ్లు త్వరగా నిర్మించుకునేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామంలోని నర్సరీని సం దర్శించి వేసవిలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసు కోవాలని, సకాలంలో నీటిని అందించి మొక్కలను పరి రక్షించాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాలలను సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వం ఆసుపత్రిని సందర్శించి సిబ్బంది విధుల పట్ల సమ యపాలన పాటించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రామ్మోహన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉమర్ షరీఫ్, మండల పంచాయతీ అధికారి జలంధర్, గృహ నిర్మాణ శాఖ ఎ.ఈ. లయకత్ అలీ, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎ.ఈ. నందన్ వర్మ, పంచాయతీ కార్యదర్శి రాహుల్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం




**అసెంబ్లీలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

**ఇచ్చోడ, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర వార్షిక బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగింని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభు త్వం ఈ వర్గాలపై సవతి తల్లి ప్రేమ చూపు తోందని విమ ర్శించారు. బుధవారం అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడాను. కేసీఆర్ పాలనలో గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు ఉండేదన్నారు. బోథ్ నియోజకవర్గంలో అటవీ అధి కారులు కందకాలు తవ్విస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. తాను చెప్పింది అవాస్తవమైతే రాజీనామా చేసేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. కేసీఆర్పై కోపంతో దళిత, గిరిజన సంక్షేమ పథకా లను ప్రభుత్వం రద్దు చేయడం సరికాదన్నారు. గతంలో 40 వేల కోట్ల బడ్జె ట్‌ను తగ్గించి 2026 - 27 బడ్జెట్లో 37 కోట్లు చేసి గిరిజను లను కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపరించిందన్నారు. వైఎస్సార్ అందించిన గిరిజన పట్టాలను కేసీఆర్ వాటిని వృక్షంలా నిలబెట్టారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దానిని నిర్లక్ష్యం చేసిందన్నారు. దళితులకు కేసీఆర్ అందజేసిన దళితబంధు, దళితబస్తీ పథకాలను విస్తరించుతామని చెప్పి కాంగ్రెస్ ప్రభు త్వం అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. మావ నాటే మావ రాజ్ కళను సాకారం చేసిన కేసీఆర్, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరా లుగా గిరిజన మంత్రిని నియమించకపోవడం కూడా వివక్షకు నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో జోడేఘాట్‌లో 40 కోట్లతో కుమ్రం భీం మ్యూజియం, నాగోబా ఆలయానికి 12 కోట్లతో అభివృ ద్ధి, హైదరాబాద్‌లో 25 కోట్లతో బంజారా భవన్, ఆదివాసీ భవన్ నిర్మించి గిరిజనులను ప్రాధాన్యం కల్పించామని గుర్తు చేశారు. జల వికాస్ పథకం పేరు మారినా చెక్కులు మం జూరు కాలేదని, గిరి జనులను మోసం చేయవద్దన్నారు. ఖ మ్మం, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, నల్గొండ, నిజా మాబాద్ జిల్లాలో కొత్త ఐటీడీఏలు ఏర్పాటు చేస్తామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. గిరిజన పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్ఓటీలను కనీసం టైంస్కేల్ అమలు చేసి అర్హులకు పక్క ఉద్యోగులుగా నియమించాలన్నారు.

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

**పశ్చిమాసియా దేశాల్లో రేగుతున్న యుద్ధ జ్వాలలు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఇంధన కొరత భయాన్ని రేకెత్తించాయి! పుకార్ల వేగంతో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు భారీ క్యూలు కట్టారు. జిల్లా యంత్రాంగం, పెట్రోల్ బంకుల నిర్వాహకులు కొరత లేదని మొత్తుకుంటున్నా, ప్రజల ఆందోళన మాత్రం తగ్గడం లేదు. "నో స్టాక్" బోర్డులు కనిపిస్తుండటంతో భయాందోళనలు మరింత తీవ్రమవుతున్నాయి. ఈ పుకార్ల నేపథ్యంలో వాటర్ బాటిళ్లు, క్యాన్లతో పెట్రోల్ నిల్వ చేసుకుంటున్న ప్రజల దృశ్యాలుఅంతటా కనిపిస్తున్నాయి.** అధికారులు భయాందోళనలను పారద్రోలడానికి ప్రయత్నిస్తుండగా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. మరో పక్క గ్యాస్ ధరలు పెరుగుతాయనే వదంతులతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొన్ని రోజుల నుంచి గ్యాస్ సిలిండర్ల కొరతతో వేకువ జాము నుంచే ఏజెన్సీల ఎదుట జనం బారులు దీరుతున్నారు. గ్యాస్ బుక్ చేసుకున్నా రావడం లేదని డీలర్లను నిలదీస్తున్నారు. రెండు రోజులుగా పెట్రోల్, డీజిల్ కూడా దొరకదనే వదంతులతో బం క్‌ల వద్ద టూ, త్రి, ఫోర్ వీలర్ వాహనదారులు పడిగాపులు కాస్తున్నారు. ఒకవైపు గ్యాస్, పెట్రోల్, డీజిల్ కోసం అవస్థలు పడుతుంటే.. మరోవైపు అధికారులు, పెట్రోల్, డీజిల్ డీలర్స్ అసోసియేషన్స్ వారు సరఫరాలో ఇబ్బంది, కొరత లేదని చెబుతున్నారు.






# పెట్రోల్..పరేషాన్..!

## పల్లెల నుంచి పట్టణాలకు పరుగులు

- ■ యుద్ధం నీడలో పెట్రోల్ కలకలం
- ■ యుద్ధం ముప్పు పుకార్లతో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఇంధన కొరత భయం!
- ■ బంకుల వద్ద వాహనదారుల క్యూ, గంటల తరబడి నిరీక్షణ
- ■ ఏజెన్సీ, బంక్‌ల ఎదుట దర్శన మిస్తున్న నో స్టాక్ బోర్డులు
- ■ కొరత మాత్రం లేదంటూ అధికారుల ప్రకటనలు
- ■ జిల్లా అధికారుల హామీలు ఉన్నా.. తగ్గని ప్రజల ఆందోళన
- ■ వాటర్ బాటిళ్లు, క్యాన్లతో ఇంధనం నిల్వ చేసుకుంటున్న ప్రజలు
- ■ సిలిండర్ల కోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు
- ■ ఉమ్మడి జిల్లాలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయి..
- ■ పుకార్లను నమ్మవద్దు.. తప్పుడు ప్రచారం చేయొద్దు
- ■ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

పశ్చిమాసియా దేశాల్లో జరుగుతున్న యుద్ధం కారణంగా జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత నెలకొందంటూ పుకార్లు షికార్లు చేయడంతో ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత లేదంటు జిల్లా అధికారులు పెట్రోల్ బంక్ నిర్వహకులు స్పష్టం చేస్తున్నప్పటికీ ప్రజలు మాత్రం భయాందోళనతో గ్యాస్ ఏజెన్సీలు,పెట్రోల్ బంకులకు పరుగులు తీస్తున్నారు. దీంతో ఖాళీ సిలిండర్లతో ఏజెన్సీల వద్ద.. వాహనాలతో పెట్రోల్ బంకుల వద్ద రాత్రి పగలు అనే తేడా లేకుండా గంటల తరబడి బారులు తీరి కనబడుతున్నారు.అటు అధికారులు ఎలాంటి కొరత లేదంటు ప్రకటనలు చేస్తుంటే మరి ఏజెన్సీలు, పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ అని బోర్డులు ఎందుకు పెడుతున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా అధికారుల ప్రకటనలు ప్రజల్లో నెలకొన్న అపోహలతో ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రజలు,వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

**బంకుల వద్ద బారులు..**

ఆదిలాబాద్ జిల్లాలో గత రాత్రి నుంచి పట్టణంలో నెలకొన్న పుకార్లతో పెట్రోల్ బంకుల వద్ద భారీగా వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం బారులు తీరారు.పెట్రోల్ దొరుకుతుందో లేదోననే భయంతో పలువురు తమ వాహనాల ట్యాంకులను ఫుల్ చేసుకుంటున్నారు. మరి కొందరైతే ఓ అడుగు ముందుకేసి వాటర్ క్యాన్లు, ప్లాస్టిక్ డాబ్బాలతో పెట్రోల్ బంక్ లకు పరుగులు తీస్తున్నారు.ప్రజల ఆందోళన నేపథ్యంలో కొన్ని పెట్రోల్ బంకుల్లో పెట్రోల్,డిజిల్ నిల్వలు లేకపోవడంతో మూసి వేయగా.. దస్నాపూర్‌లోని పెట్రోల్ బంక్ లో మాత్రం బంక్ నిర్వహకులు వాహనదారులకు ఎలాంటి కొరత లేదంటు మైక్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. దీనికి తోడు ఇష్టారీతిన పెట్రోల్ పోసుకోవడంతో ఇతరులకు ఇబ్బందులు కలగకుండా కేవలం ఒక వాహనానికి రూ.100 పెట్రోల్‌ను విక్రయిస్తున్నారు. అదే విధంగా వాటర్ బాటిళ్లతో వచ్చే వారికి పెట్రోల్ ఇవ్వడం లేదు. ఇదిలా ఉంటే.. పెట్రోల్ కోసం ప్రజలు గ్రామాల నుండి పట్టణాలకు సైతం పరుగులు తీస్తున్నారు. అవసరం లేకున్నా వాహనాల్లో పెట్రోల్, డీజిల్‌లను అధిక మొత్తం నిల్వ చేసుకోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అటు పెట్రోల్ కొరత ఉందనడంతోనే బంకుల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు.ఎలాంటి కొరత లేకుంటే ఈ ఇబ్బందులేంటాని ప్రశ్నిస్తున్నారు.

**పుకార్లను నమ్మవద్దు: డీఎస్ఓ నందిని**

ఆదిలాబాద్ జిల్లాలో పెట్రోల్ కొరత నెలకొందనే పుకార్లను ప్రజలు నమ్మొద్దని డీఎస్ఓ నందిని సూచించారు.పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరడంతో బుధవారం ఆయా బంకులను ఆమె సందర్శించి అక్కడి పరిస్థితిపై ఆరా తీశారు.ఇంధన నిల్వలున్నాయని తెలియజేస్తూ ప్రజలు ఆందోళనకు గురికావొద్దని సూచించారు.పుకార్ల కారణంగా వాహనదారులు అధిక మొత్తంలో పెట్రోల్, డీజిల్ వేయించుకోవడంతో ఆయా బంకుల్లో కొరత ఏర్పడి నో స్టాక్ బోర్డులు పెట్టాల్సి వచ్చిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 17 బంకుల్లో ఎలాంటి కొరత లేకుండా ఇంధనం అందుబాటులో ఉంచేలా జిల్లా కలెక్టర్ ఇప్పటికే ఆయా కంపెనీల ప్రతినిధులతో మాట్లాడడం జరిగిందని వివరించారు.ప్రజలు భయాందోళనకు గురి అయి బంకుల వద్ద బారు తీరొద్దని, అవసరం మేరకే పెట్రోల్, డీజిల్ ను తీసుకోవాలని సూచించారు. ఈ పరిస్థితిని ఆసరా చేసుకుని కృత్రిమ కొరత సృష్టించిన.. బ్లాక్‌లో విక్రయించిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పెట్రోల్, డీజిల్ కొరత లేదు

**రాష్ట్రంలో సరిపడా ఇంధన నిలువలు**

**ఏ ఒక్కరూ గందరగోళంలో పడకండి**

**వదంతులతో ఆందోళన చెందకండి**

**రాష్ట్ర ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్బోధ**

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్,ఎల్.పి.జి కొరత ఉత్పన్నమయ్యే ప్రసక్తేలేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధానంగా హైదరాబాద్ లో డీజిల్,పెట్రోల్ బంక్ ల వద్ద పెద్ద ఎత్తున ఉన్న క్యూలను చూసి పెట్రోల్,డీజిల్,ఎల్.పి.జి కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇంధన వనరులతో పాటు ఎల్.పి.జి కొరత అంటూ వస్తున్న వదంతులతో ప్రజాలేవరు గందరగోళంలో పడొద్దని ఆయన ఉద్బోధించారు. ఈ మేరకు రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలసి ఆయన మీడియాతో ముచ్చటించారు. రానున్న మూడు నెలలకు సరిపడా నిల్వలు ఉన్నాయని జరుగుతున్న వదంతులతో ఏ ఒక్కరూ అయోమయంలో పడొద్దని ఆయన ఉద్బోధించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్,భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ తో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీలు ఇంధన సరఫరాలను గణనీయంగా పెంచాయని ఆయన పేర్కొన్నారు. డిమాండ్‌ని మించి సరఫరా కొనసాగుతోం దని, ఈ రోజు 17,246 కిలో లీటర్ల డిమాండ్ ఉండగా 17,898 కిలోలీటర్ల సరఫరా జరగడమే ఇందుకు నిదర్శనమన్నారు.అంటే 652 కిలో లీటర్ల అదనపు నిల్వ మిగిలిందన్నారు. దీనికి తోడు అదనంగా 16,000 కిలోలీటర్ల ఇంధనం నిల్వ ఉంచడంతో పాటు 1200 అదనపు ట్యాంకర్లను వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు. వినియోగదారులు గందరగోళంలో పడి పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేయడంతొ రోజు వారి డిమాండ్ ఒక్కసారిగా 25% పెరిగినా రోజువారీ సరఫరాలో సగటున పోల్చిచూసినపుడు కుడా ఎక్కడా అంతరాయం కలుగ కుండా అదనంగా 22% అందుబాటులో ఇంధన వనరులు నిల్వలు ఉన్నాయని ఆయన తెలిపారు. అయితే కొన్ని పెట్రోలు బంక్ లకు నిర్ణిత సమయానికి ట్యంకర్లు చెరుకోక పోవడంతో ఆయా బంక్‌లలో నో-స్టాక్ బోర్డులు వెలుస్తున్నాయన్నారు. వాస్తవంగా మాత్రం ఎంత మాత్రం కొరత లేదని ఆయన పునరుద్ఘాటించారు. అయితే అదే సమయంలో షికార్లు చేస్తున్న పుకార్లను నమ్మి వినియోగదారులు కంటైనర్లలో,డబ్బాలలో పెట్రోల్, డీజిల్ ని తీసుకెళ్లడం పూర్తిగా చట్టవ్యతిరేకమైన చర్య అని అంతకుమించి ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. పెట్రోలియం నిలువలు రానున్న 65 రోజులకు సరిపడా ఉన్నాయని,సరఫరాలో ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకుండా ఉండేలా నిరంతరం కొనసాగేందుకు వీలుగా లైన్‌ను విస్తరించినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్ర రాజధానిలో 596 పెట్రోల్ బంక్ లు నిరంతరాయంగా పని చేస్తున్నాయని, హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో ఎక్కడ కుడా కొరత లేదని,అహ్మదాబాద్, సూరత్, బెంగుళూరు, ధారవాడ, బెల్గాం వంటి నగరాలలో కూడ ఇదే పరిస్థితి ఉత్పన్నమయ్యాయన్నారు. ఎల్.పి.జి విషయంలో ఎటు వంటి కొరత లేదని,కాకపోతే కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంతమేర సమస్య ఉన్నట్లు గుర్తించమన్నారు. ఇదే సందర్భంలో అక్రమంగా వినియోగిస్తున్న 2,952 కమర్షియల్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. పెట్రోల్, డీజిల్ గృహ వినియోగదారులకు అవసరమైన ఎల్.పి.జి సమృద్ధిగా అందుబాటులో ఉందని,ప్రజలేవరు అయోమ యానికి గురి కావొద్దని,వదంతులను ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మొద్దని రాష్ట్ర ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.



# ఈ-పాస్ లోపాలతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారం

- సాంకేతిక సంకెళ్లలో స్కాలర్‌షిప్‌లు
- నిలిచిన ఆర్టీఎఫ్ బిల్లుల ప్రక్రియ
- బడ్జెట్ ఉన్నా అందని సాయం
- ఈ-పాస్ పోర్టల్‌లో కొరవడిన 'ఎడిట్' ఆప్షన్
- విద్యార్థుల హక్కుకు సాంకేతిక బ్రేక్
- ముగింపు దశలోనూ కొలిక్కిరాని ప్రక్రియ



**ఆసిఫాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-పాస్ పథకం ప్రస్తుతం సాంకేతిక సమస్యల వలన తీవ్రంగా ప్రభావితమవుతోంది. ముఖ్యంగా కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలలు ఈ సమస్యలతో తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ-పాస్ పోర్టల్‌లో ఆర్టీఎఫ్ బిల్లులు జనరేట్ చేసే సమయంలో "నో ఫీ" అని చూపించడం వల్ల ప్రొసీడింగ్స్ రావడం లేదు. ఇదే సమయంలో కాలేజీ లాగిన్‌లలో "బల్క్ ప్రింట్" ఆప్షన్ లేకపోవడం వల్ల బయోమెట్రిక్ పూర్తిచేసిన విద్యార్థుల వివరాలను జిల్లా సంక్షేమ శాఖకు సమర్పించడం సాధ్యపడడం లేదు. అంతేకాకుండా, జిల్లా ఈపాస్ లాగిన్‌లలో 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించిన కోర్సులు, వాటికి సంబంధించిన ఫీజు వివరాలు కనిపించడం లేదు. దీనివల్ల బిల్లులు ప్రాసెస్ చేయడం పూర్తిగా నిలిచిపోయింది. బడ్జెట్ ఉన్నప్పటికీ, ఈ సాంకేతిక లోపాల వలన ఆర్థిక సహాయం విద్యార్థులకు చేరకుండా అడ్డంకులు ఏర్పడుతున్నాయి. మరోవైపు, ప్రొసీడింగ్స్ జనరేషన్ సమయంలో ఐఎఫ్‌ఎస్సీ కోడ్‌లో పొరపాట్లు ఉన్నప్పటికీ, వాటిని సరిచేసే ఎడిట్ సదుపాయం లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. ప్రస్తుతం 2025--26 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న వేళ, ఈ సమస్యలు పరిష్కారం కాకపోతే వేలాది మంది విద్యార్థులు తమ హక్కైన స్కాలర్‌షిప్‌ను కోల్పోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ సైతం ఉపయోగించలేక సరెండర్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇది విద్యార్థులకే కాదు, విద్యాసంస్థలకు తీవ్రమైన నష్టం కలిగించే అవకాశం ఉంది. గత రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సమస్యలు విద్యార్థుల భవిష్యత్తు పై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



### పొనకల్ పంచాయతీకి
## రెగ్యులర్ ఈఓను నియమించాలి

**జన్నారం, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీకి రెగ్యులర్ ఈఓను నియమించాలని కోరుతూ 11వ వార్డు సభ్యుడు ముడుగు ప్రవీణ్ కుమార్ బుధవారం మంచిర్యాల అదనపు కలెక్టర్ చంద్రయ్య కు వినతిపత్రం అందజేశారు. ఈఓ లేకపోవడంతో పంచాయతీలో సమస్యలు పేరుకుపోతున్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పాలన గాడిలో పడాలంటే వెంటనే పూర్తిస్థాయి అధికారిని కేటాయించాలని ఆయన విన్నవించారు.

### శనగ కొనుగోలు
## పూర్తిస్థాయిలో చేపట్టాలి

**ఆదిలాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లాలో రైతులు పండించిన శనగ పంటను నిబంధనలు లేకుండా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థనాఫెడ్ ద్వారా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారుల సర్వే ప్రకారం ఉమ్మడి జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో 6,86,290 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెప్పారు. ఎకరానికి7 క్వింటాల 13 కిలోల చొప్పున 1,54,650 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించడం వల్ల మిగిలిన 5,31,641 క్వింటాళ్లను రైతులు ఎక్కడ విక్రయించాలనే సందిగ్ధ పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రస్తుతం ఎకరానికి 11నుంచి12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వరంగ కొనుగోలు సంస్థ నాఫెడ్ ఎకరానికి 7 క్వింటాళ్ల 13 కిలోలు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడం సమంజసం కాదని విమర్శించారు.

## చిరుధాన్యాల సాగుపై అవగాహన

**నార్నూర్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

ఇండియాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐసీఏఆర్-ఐఐఎంఆర్) సంస్థ గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని మాన్కాపూర్ గ్రామంలో చిరుధాన్యాల సాగు, యాజమాన్య పద్ధతులపై గిరిజన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాన్కాపూర్, చిన్నుగూడ, బలన్పూర్, ముక్తాపూర్ గ్రామాల రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. శాస్త్రవేత్తలు శ్రీనివాస్, సేవానాయక్ చిరుధాన్యాల సాగు విధానాలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆకాశ్, సీసీడీ సంస్థ ఫీల్డ్ అసిస్టెంట్ శివరాజ్, సర్పంచ్ తొడసం రేణుకబాయి, మాజీ ఎంపీపీ మెస్రం రూపవ్పటేల్, మాజీ ఉప సర్పంచ్ రాయిసిడాం రూపేవ్, మెస్రం బాదిరావ్ పాల్గొన్నారు.

## ఎగ్గాం గ్రామం సందర్శన

**ముథోల్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా భైంసా మండలం ఎగ్గాం గ్రామాన్ని బుధవారం డీపీవో శ్రీనివాస్ సందర్శించారు. పంచాయతీ రికార్డులు, పీహెచ్సీ, పారిశుధ్యం పరిశీలించారు. పారిశుధ్యంపై శ్రద్ధ తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కార్యదర్శి సాయినాథ్, నాయకుడు మహేందర్ ఉన్నారు. గ్రామంలోని నర్సరీని సం దర్శించి వేసవిలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసు కోవాలని, సకాలంలో నీటిని అందించి మొక్కలను పరి రక్షించాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం శ్రద్ధ వహించాలని తెలిపారు. భోజనం విషయంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు.

# బీఆర్ఎస్ హయాంలోనే డబుల్ బెడ్రూంలు

### అసెంబ్లీ సమావేశంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

**ముథోల్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

బీఆర్ఎస్ హయాంలోనే డబుల్ బెడ్రూంలు ఇచ్చా రని, ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్లు ఎన్ని ఇచ్చారో బుధవారం చెప్పాలని అసెంబ్లీ సమావేశాల్లో ముథోల్ ఎమ్మెల్యే రామా రావు పటేల్ ప్రస్తావించారు. పేదలకు బీఆర్ఎస్ హయాంలోనే ఇచ్చారని, భైంసాలో మాత్రమే డబుల్ బెడ్రూంలు పూర్తయ్యాయని, ఇంకా ఎక్కడ పూర్తి కాలేదన్నారు. అంతేగాకుండా ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



# తప్పిపోయిన బాలుడి అప్పగింత



**ముథోల్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

నర్సాపూర్ మండల కేంద్రంలో బుధవారం జరిగిన వారంతా సంతలో నాలుగేళ్ల బాలుడు తప్పిపోయారు. సంతలో ఒంటరిగా ఏడుస్తున్న బాలుడిని గుర్తించిన నారి శక్తి మహిళా పోలీస్ కానిస్టేబుల్ అక్కడికి చేరుకున్నారు. తల్లిదండ్రుల కోసం వెతికిన దొరకలేదు. వెంటనే ఆ బాలుని నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అన్నం తినిపించి బిస్కెట్లు ఇచ్చి ఊరు పేరు అడగగా గొల్లపేట్ చెప్పడంతో వారు అక్కడికి సమాచారాన్ని అందించారు. తప్పిపోయిన తల్లి ఈ విషయాన్ని తెలుసుకొని పోలీస్ స్టేషన్ వెళ్లగా బాలుడిని అప్పగించారు.

# అసెంబ్లీ ముట్టడి పోస్టర్ల ఆవిష్కరణ



**నిర్మల్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ 26న ఆద్మీ అసెంబ్లీ ముట్టడి నిర్వహిస్తున్నట్టు జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ అన్నారు. బుధవారం అసెంబ్లీ ముట్టడి పోస్టర్లను ఆవిష్కరించారు. నిరుద్యోగులందరూ ఈ ముట్టడి కార్యక్రమం పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్ రాజేశ్వర్ మైముద్ రైతులు పాల్గొన్నారు.

## స్వగ్రామానికి మృతదేహాన్ని రప్పించాలి

**లక్ష్మణచందా, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పార్పెల్లికి చెందిన కందుకూరి రాజేశ్వర్(54) బహ్రెయిన్‌లో గత ఫిబ్రవరి 26న గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా విమానాల రాకపోకలు నిలిచిపోయింది. మృతదేహం స్వగ్రామానికి తీసుకురావడంలో జాప్యం జరుగుతోంది. స్వగ్రామానికి వెంటనే తీసుకువచ్చేలా చూడాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. ఎన్ఆర్ కమిటీ రాష్ట్ర సభ్యులు స్వదేశ్ పరికిపండ్ల ఇప్పటికే ప్రవాసీ భారతీయ సహాయత కేంద్ర (పి.బి.ఎస్.కే)కు ఈ-మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఎన్ఆర్ఐ విభాగానికి మరోసారి వివరాలు పంపి ప్రయత్నాలు చేపట్టారు. అతడు కూలీగా పనిచేస్తున్న అర్గోస్ కాంట్రాక్టింగ్ అండ్ మెయింటెనెన్స్ కంపెనీ, రాయబార కార్యాలయ అధికారులు దహన సంస్కారాలు బహ్రెయిన్‌లో చేయమని కుటుంబీకులపై ఒత్తిడి చేస్తున్నారు. ఈ విషయాన్ని సర్పంచ్ పుష్ప, రాష్ట్ర సభ్యులకు తెలుపగా బుధవారం స్వదేశ్, ఉప సర్పంచ్ విద్య సాగర్రెడ్డి, న్యాయవాది ఫసియొద్దీన్ కుటుంబ సభ్యులను కలిసి మృతదేహం స్వగ్రామానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్వదేశ్.. ఎన్ఆర్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విన్నవిస్తామని ఆయన తెలిపారు.

## సికింద్రాబాద్ నుండి ఖానాపూర్‌కు బస్సు

**నిర్మల్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్- కడెం ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ నిర్మల్ డిపో ఆధ్వర్యంలో జేబీఎస్ నుండి నిర్మల్, ఖానాపూర్ కడెంకు బస్సు నడుపుతున్నట్టు నిర్మల్ డిఎం పండరి తెలిపారు ప్రతిరోజు రాత్రి 22:20 కి సూపర్ లగ్జరి బస్సు సికింద్రాబాద్ నుండి బయలుదేరి ఖానాపూర్ కడెం చేరుకుంటుందన్నారు. ఖానాపూర్, కడెం పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినించుకోవాలని సూచించారు.

**లోకేశ్వరం -అబ్దుల్లాపూర్ సర్వీస్...**

నిర్మల్ నుండి లోకేశ్వరం మండల మీదుగా అబ్దుల్లాపూర్ వరకు బస్సు నడిపిస్తున్నట్టు నిర్మల్ పండరి తెలిపారు. గతంలో ఈ బస్సు నిజాంబాద్ జిల్లా నందిపేట్ వరకు వెళ్లేదని ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు దాన్ని అబ్దుల్లాపూర్ వరకు మన్నించడం జరిగిందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వించుకోవాలన్నారు.





# మెనూలో రాజీ వద్దు.. పారిశుధ్యంపై పకడ్బందీగా ఉండాలి

### చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి - ఏకలవ్య పాఠశాలలో కలెక్టర్ రాజర్షి షా ఆకస్మిక తనిఖీ

**ఇంద్రవెల్లి, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఇంద్రవెల్లి మండలంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులు, విద్యార్థుల హాజరు పట్టిక, భోజన మెనూ ఆయన పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం వసతి గృహంలో పలువురు విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న భోజన నాణ్యతను, వసతి గృహంలోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఇంగ్లీష్ భాషా, సబ్జెక్టుపై నైపుణ్యం పెంచుకోవాలని సూచించి, వారిని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలను రాబట్టారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, పారిశుధ్యం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాల ఆవరణలోని వాకింగ్ మరమ్మతులు చేపట్టి త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పాఠశాలలోని వంట గది, సరుకు నిల్వల గది, భోజన శాల, వసతి గృహాలను పరిశీలించారు. పాఠశాలలో అవసరమైన స్పోర్ట్స్ షూస్, గ్రిజర్స్, ఇతర సౌకర్యాలు, వసతులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలి ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. పరిశీలనలో తహసీల్దార్ ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ రేఖ రాణి, డిఈ శివ ప్రసాద్, పిఈటి సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# ఉద్యాన నర్సరీల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

### సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్



**బెల్లంపల్లి, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూరు పరిధిలోని ఉద్యాన నర్సరీల సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల 100 ఎకరాల తోటను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ఉద్యాన నర్సరీల బలోపేతం దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని రాజంపేట లో ఉద్యాన నర్సరీలను అధికారులు ఆకస్మికంగా సందర్శించాలని తెలిపారు. ఈ సంవత్సరం ఆగ్రో ఫారెస్ట్రీ, నేషనల్ బ్యాంబు (వెదురు) మిషన్ లో భాగంగా 2 కోట్ల రూపాయల నిధులతో నర్సరీలలో మొక్కల పెంపకంతో పాటు మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు అవసరమైన మొక్కలను నాణ్యత ప్రమాణాలు పాటించి తక్కువ ధరకు అందుబాటులో ఉంచుతామని, మామిడి, వెదురుతో పాటు వివిధ రకాల పండ్ల మొక్కలు, అలంకరణ మొక్కలు పెంచడానికి చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## విలేకరులు కావలెను

ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక

9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY




## మాజీ మావోయిస్టు
# కుటుంబాన్ని ఆదుకుంటాం

**ఆసిఫాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
మాజీ మావోయిస్టు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కలెక్టర్ హరిత అన్నారు. సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించి జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఎస్పీ నితికా పంత్, ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ పట్టణంలోని సందీప్‌నగర్‌కు చెందిన బోయిని నగేష్ అనే మాజీ మావోయిస్టు కుటుంబాన్ని ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరికి చర్యలు తీసుకుంటామని అన్నారు. నగేష్ సాగు చేస్తున్న ప్రభుత్వ భూమికి లావుని పట్టా మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామన్నారు. నగేష్ భార్యను మహిళా సంఘాల గ్రూపుల్లో సభ్యురాలిగా చేర్పించి బ్యాంకు రుణం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పదో తరగతి చదివి మానేసిన నగేష్ కూతురు ఉన్నత చదువులు కోసం చేయూతనిస్తామని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీవో దత్తారావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కవ్వాల టైగర్ రిజర్వ్‌లో
# శాఖాపరమైన వేటు

### ఇద్దరు అటవీ అధికారుల సస్పెన్షన్ - 'నిర్లక్ష్యం'పై చర్యలు
### డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్ ఇంటికి
### ఇసుక అక్రమాలు.. విధుల్లో బేఖాతరు
### అటవీ శాఖ అధికారులపై సస్పెన్షన్ వేటు-అటవీ శాఖలో కలకలం
### ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసిన పీసీసీఎఫ్, డీఎఫ్ఓ

**జన్నారం, మార్చి 25 (ప్రభాత సమాచారం)**



విధుల్లో నిర్లక్ష్యం వహించారనే అభియోగం మేరకు మంచిర్యాల జిల్లా కవ్వాల టైగర్ రిజర్వ్‌లోని జన్నారం ఫారెస్ట్ రేంజ్ లో ఇద్దరు ఫారెస్ట్ అటవీ అధికారులను అటవీ శాఖ ఉన్నతాధికారులు బుధవారం సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణతో జన్నారం ఫారెస్ట్ డిప్యూటి రేంజ్ ఆఫీసర్ కుమారస్వామి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లవన్ కుమార్‌లను సస్పెండ్ చేసినట్లు ఎఫ్‌డీవో రామ్మోహన్ తెలిపారు. డిప్యూటి రేంజ్ ఆఫీసర్‌ను కాలేశ్వరం జోన్ పీసీసీఎఫ్ ప్రభాకర్ సస్పెండ్ చేశారని, ఆ బీట్ ఆఫీసర్‌ను మంచిర్యాల డీఎఫ్ఓ శివ్ ఆశీష్ సింగ్ సస్పెండ్ చేశారని ఎఫ్డీఓ తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంతో పాటు ఇటీవల పట్టుకున్న ఇసుక ట్రాక్టర్ల వ్యవహారంలోనూ, ఇతర పలు ఆరోపణల నేపథ్యంలో ఆ ఇద్దరు అటవీ అధికారులను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**ఆసిఫాబాద్, మార్చి 25 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర వసతి గృహాన్ని బుధవారం సందర్శించారు. విద్యార్థుల గదులు, వంట శాల, నిత్యావసర సరుకుల నిలువ గది, భోజనశాల, పరిసరాలను పరిశీలించారు. సాయంత్రం విద్యార్థులకు అందిస్తున్న స్నాక్స్ రుచి చూశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని సూచించారు. ఆహారం తయారు సమయంలో తాజా కూరగాయలు వినియోగించాలన్నారు. గదుల్లో శుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అవసరమైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీవో తెలిపారు.

